

ఆపరేషన్ దేశీదార్

- జిల్లా సరిహద్దులో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు
- దసరా టార్గెట్ కోసం ఎక్సైజ్ శాఖ ముమ్మర కసరత్తు
- సరిహద్దు గ్రామాల్లో అక్రమ మద్యం అమ్మకాలు
- స్థానిక ఎన్నికల హడావిడితో పెరిగిన మద్యం విక్రయాలు
- నిరంతర తనిఖీలతో కట్టడి చర్యలు చేపడుతున్న ఎక్సైజ్ శాఖ


ఇటీవల పట్టుకున్న దేశీదారు మద్యంతో ఎక్సైజ్ శాఖ అధికారులు

ఆదిలాబాద్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగ దగ్గర పడడంతో ఎక్సైజ్‌శాఖ తనిఖీలు ముమ్మరం చేస్తుంది. ఆపరేషన్ దేశీదార్ పేరిటా జిల్లా సరిహద్దుల్లో ప్రత్యేక నిఘాను సారిస్తుంది. మహారాష్ట్రలో చౌకగా దొరికే దేశీదార్ మద్యాన్ని విక్రయిస్తూ కొందరు వ్యాపారులు అడ్డగోలు సంపాదనకు ఎగబడుతున్నారు. ప్రధానంగా దసరా పండుగను దృష్టిలో పెట్టుకుని అక్రమమద్యం అమ్మకాలు ఊపందుకుంటున్నాయి. ఎక్సైజ్ శాఖ అధికారుల దాడుల్లో భారీగా దేశీదారు మద్యం పట్టుబడడం చర్చనీయాంశంగా మారింది. గడిచిన తొమ్మిది మాసాలలోనే ఆదిలాబాద్ సర్కిల్ పరిధిలోనే 63 కేసులు నమోదు కాగా 66 మంది మద్యం వ్యాపారులను అరెస్టు చేశారు. ఇందులో 564.56 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కాగా మద్యాన్ని తరలిస్తున్న 21 వాహనాలను సీజ్ చేశారు. అలాగే ఉట్నూర్, ఇచ్చోడ ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలోను మరిన్ని కేసులు నమోదైనట్లు తెలుస్తుంది. సరిహద్దు మండలాలైనా తాంసి, భీంపూర్, జైనథ్, బేల, నార్నూర్, బోథ్ మండలాలతో పాటు ఆదిలాబాద్‌అర్బన్‌లో దేశీదార్ అక్రమ మద్యం అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. దీంతో అక్రమ మద్యం అమ్మకాలను అరికట్టేందుకు ఎక్సైజ్‌శాఖ ప్రత్యేక కార్యచరణను చేపట్టింది.

స్పెషల్ డ్రైవ్

ఎక్సైజ్ శాఖ అక్రమ మద్యం అమ్మకాల పై స్పెష ల్ డ్రైవ్‌ను నిర్వహిస్తుంది. రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ అధికారులతో పాటు జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సంయుక్తంగా దాడులు చేస్తూ అక్రమ మద్యం అమ్మకాలను అరికట్టే ప్రయత్నం చేస్తున్నారు. అయిన అడ్డుకట్ట పడినట్లు కనిపించడం లేదు. సరిహద్దు గ్రామాల్లో పట్టుకున్న కొద్ది

(మిగతా 6వ పేజీలో)

విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన సేవలు

● ఎస్ఈ జేఆర్‌చౌహాన్


జేఆర్ చౌహాన్

ఆదిలాబాద్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించేందుకు ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకు రావడం జరిగిందని విద్యుత్‌శాఖ ఎస్ఈ జేఆర్ చౌహాన్ ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక యాప్‌లో 20 ఫ్యూచర్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. వినియోగదారులు ప్లేస్టోర్‌లో టీజీఎన్‌పీడీసీఎల్ అని టైప్ చేసి ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. ఇందులో రిపోర్ట్ ఆన్ ఇన్సిడెంట్ ఎక్కడైనా సంఘటన జరిగిన వెంటనే జీపీఎస్ లోకేషన్ ద్వారా వినియోగదారుని ఫోన్ నుంచే ఫోటోలు తీసి పంపే అవకాశం ఉందన్నారు. కన్జుమర్ గ్రీవెన్స్ దీని ద్వారా వినియోగదారులకు సంబంధించిన సమస్యలను నేరుగా తెలిపే అవకాశం ఉందన్నారు. సెల్ఫ్ రీడింగ్ ప్రతీనెల వారీ విద్యుత్ బిల్లులను స్వయంగా సెల్ఫ్ మీటర్ రీడింగ్ చేసుకోవచ్చన్నారు. ఇలా పే బిల్స్, బిల్ హిస్టరీ, ఆన్‌లైన్ పేమెంట్ హిస్టరీ, కొత్త కనెక్షన్, డోమెస్టిక్ బిల్ క్యాల్యుక్‌లెటర్, పేరు, లోడు మార్పు, పవర్ కన్జెప్షన్, టారిఫ్ డీటెయిల్స్, ఎనర్జి సేవింగ్ టిప్స్, సేఫ్టీ టిప్స్, ఫీడ్‌బ్యాక్ తదితర సేవలను పొందే అవకాశం ఉందన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభం

బోథ్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సోనాల మండల కేంద్రంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. తాత్కాలిక అధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రారంభం కాగా శ్రీనివాస్ దంపతులు ఉత్సవాలలో పాల్గొన్నారు.

మండల సమాఖ్య బలోపేతానికి కృషి చేయాలి

● ఏపీఎం దేవానందం

నార్నూర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఏజెన్సీ గిరిజన ప్రాంత గాదిగూడ మహాలక్ష్మి మండల సమాఖ్య బలోపేతానికి సీసీలు, వీఓఏలు, గ్రామ సంఘాల ఓబీలు ఇష్టపడి, కష్టపడి పని చేసి మండల సమాఖ్య బలోపేతానికి సమిష్టిగా కృషి చేయాలని ఏపీఎం దేవానందం అన్నారు. మండల కార్యాలయంలో బుధవారం ఎమ్మెస్ అధ్యక్షురాలు మంగళ అధ్యక్షతన సమాఖ్య సమావేశాన్ని నిర్వహించారు.

కరీంనగర్, మంచిర్యాల జిల్లాలకు గునుగు పూల సరఫరా


బోథ్ నుంచి గునుగు పూలు తీసుకు వెళ్తున్న దృశ్యం

బోథ్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ పండుగకు గునుగు పూలను కరీంనగర్ మంచిర్యాల జిల్లాలకు చెందిన వారు తీసుకువెళ్తున్నారు. బోథ్ మండలంలో పలువురి చేలలో గునుగు పూలు విపరీతంగా ఉండడంతో అక్కడి నుంచి వాహనాలలో వచ్చిన వారు గునుగు పూలను సేకరించి బతుకమ్మలను పేర్చేందుకు తీసుకు వెళుతున్నారు. ఆ ప్రాంతంలో పూల కొరత ఉండడంతో ఇక్కడి నుంచి తీసుకువెళ్లి విక్రయించనున్నామని కూలీలు పేర్కొన్నారు.

బంతిపూలు పూసే.. అన్నదాత మురిసే

- తక్కువ పెట్టుబడి..ఎక్కువ ఆదాయం
- 100 రోజుల్లో చేతికి పంట
- బతుకమ్మ పండుగతో భలే డిమాండ్

7



యూరియా కోసం రైతుల తిప్పలు


బోరజ్‌లో ఆధార్ కార్డులను క్యూలో ఉంచిన రైతులు

జైనథ్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జైనథ్ మండలంలోని సాత్నాల, బోరజ్, జైనథ్ సొసైటీ జైనథ్ ఆగ్రోస్, పెండల్‌వాడ మేడిగూడ సొసైటీ కేంద్రాలతో పాటు బేల మండలంలోని డోప్తాల, బేల మండల కేంద్రాలలో బుధవారం యూరియా పంపిణీ కార్యక్రమాన్ని అధికారుల సమక్షంలో నిర్వహించారు. యూరియా కొరతతో జైనథ్, బేల మండలాల రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పట్టాపాస్‌బుక్‌కు రెండు యూరియా బ్యాగులను ప్రభుత్వం పంపిణీ చేయడంతో రైతులు తమ ఆధార్ కార్డులతో క్యూకట్టి తీసుకున్నారు. రైతులకు సకాలంలో యూరియా అందించే విధంగా జైనథ్, బేల వ్యవసాయాధికారులు పోలీసులు సహకార సంఘం అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో బోరజ్ వ్యవసాయాధికారి ఎండీ అస్రఫ్, జైనథ్ వ్యవసాయాధికారి పూజ, బేల వ్యవసాయాధికారి జీ.తేజ, జైనథ్ సహకార సంఘం సీఈఓ. జీ.గంగన్నతో పాటు జైనథ్, బోరజ్, బేల, సాత్నాల మండలాల రైతులు పాల్గొన్నారు.

ఎడ్లబండ్లతో అర్ధరాత్రి నుంచి పడిగాపులు


సుంకిడిలో యూరియా కోసం ఎడ్లబండ్లపై వచ్చిన రైతులు


తలమడుగు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల రైతులకు యూరియా కష్టాలు తప్పడం లేదు. రెండు యూరియా బస్తాల కోసం అర్ధరాత్రి నుంచి ఎడ్ల బండ్లతో రైతులు క్యూ లైన్‌లో ఉండ వాడాల్సిన పరి స్థితి ఏర్పడుతున్నాయి. బు ధవారం తలమడుగు సహకార సంఘం సుంకిడిలో పంపిణీ చేసిన యూ రియా బస్తాల కోసం కుచలాపూర్, సాయిలింగి, సుంకిడి, ఉండం, ఖోడద్ గ్రామాల రైతులు తెల్లవారు జామున మూడు గంటల నుంచి యూరియా కోసం సుంకిడి గ్రామంలో గల పంపిణీ కేంద్రం వద్దకు ఎడ్లబండ్లతో, ద్వి చక్ర వాహనాలతో వచ్చి క్యూలైన్‌లో నిలబడ్డారు. ఈ సందర్భంగా రైతు లు మాట్లాడుతూ గత 20 రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో పంటలు బాగా దెబ్బతిన్నాయని, వాటిని కాపాడుకునేందుకు యూరియా అవసరం ఉన్నప్పటికీ జిల్లా అధికారులు రైతులకు సరిపడా యూరియా అందించడం లేదన్నారు. మండలంలో దాదాపు 50 వేల ఎక రాల్లో పంటలు సాగవుతున్నప్పటికీ కేవలం 25 వేల ఎకరాలకి యూరి యాను సరఫరా చేశారన్నారు. ఇలాంటి యూరియా కష్టాలు ఇప్పటి వరకు చూడలేదు అన్నారు. యూరియా కోసం రాత్రింబవళ్లు కష్టపడాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. ఇప్పటికైనా అధికారుల స్పందించి మండల రైతులకు సరిపడా యూరియాను సరఫరా చేయాలని కోరారు. కాగా సుంకిడి వద్ద ఏర్పాటు చేసిన యూరియా పంపిణీ కేంద్రం వద్ద మం డల వ్యవసాయ అధికారి ప్రమోద్ రెడ్డి, సీఈవో మోతే శ్రీనివాసులు దగ్గ రుండి రైతులకు ఆధార్ కార్డు, పట్టా పాస్ బుక్ ఆధారంగా ప్రతి రైతుకు రెండు యూరియా నానో యూరియాను అందించారు. రైతులెవరు ఆందో ళన చెందవద్దని రైతులకు సరఫరా యూరియాను ప్రభుత్వం పంపిణీ చేస్తుందన్నారు. యూరియా కోసం జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జ రిగిందని వారు పేర్కొన్నారు. అదేవిధంగా బరంపూర్‌లోను రైతులకు యూరియా పంపిణీ చేయడం జరిగిందన్నారు.

టీపీసీసీ అధ్యక్షుణ్ని కలిసిన సామ రూపేష్‌రెడ్డి


టీపీసీసీ అధ్యక్షుడితో సామ రూపేష్‌రెడ్డి

ఆదిలాబాద్ అర్బన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మకంటి మహేష్‌కుమార్ గౌడ్‌ను హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆదిలాబాద్ యువజన కాంగ్రెస్ అసెంబ్లి ఉపాధ్యక్షుడు సామ రూపేష్ రెడ్డి బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని రాజకీయాలపై టీపీసీసీ అధ్యక్షుడు అడుగగా పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు సామ రూపేష్‌రెడ్డి తెలిపారు. అదేవిధంగా స్థానిక ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ నాయకులకు అవకాశం కల్పించాలని కోరగా దీనికి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

ఘనంగా ఎన్ఎస్ఎస్ దినోత్సవం


విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న లక్ష్మణ్

ఉట్నూర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ సేవా దినోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మంగళవారం నిర్వహించిన ఎన్ఎస్ఎస్ డే సందర్భంగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ చేరాల లక్ష్మణ్ మాట్లాడుతూ చదువుకుంటున్న విద్యార్థుల్లో సామాజిక దృక్పథాన్ని పెంపొందించేందుకు జాతీయ సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యార్థి దశ నుంచే ప్రతీ ఒక్కరు సామాజిక బాధ్యతలు నిర్వహించాలన్నారు. కళాశాల స్థాయిలోనే విద్యార్థుల్లో సామాజిక స్పృహ కల్పించడానికి ఎన్ఎస్ఎస్ ఆవిర్భవించిందన్నారు. ఈ సందర్భంగా జాతీయ సేవా పథకం లక్ష్యాల గురించి చీరాల లక్ష్మణ్‌తో పాటు అధ్యాపకులు శ్రీనివాస్, వినోద్, దత్తు ఎన్ఎస్ఎస్ గొప్పదనం గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులు కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సువర్ణ, శ్రీలత, గణేష్, సుజాత, అశ్విన్, నీలోఫర్, రాను సుధాకర్, విష్ణు, అధ్యాపకేతరులు మల్లేష్, సాయికృష్ణ, అజీజ్‌ఖాన్ పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థల సేవలు అభిందనీయం

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్మైల్ సొసైటీ ద్వారా వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని, పేదలు, నిస్సహాయులకు అండగా సొసైటీ సభ్యులు నిలబడుతున్నారని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. బుధవారం స్మైల్ సొసైటీ అధ్యక్షులు కేమ శ్రీకాంత్ జన్మదినాన్ని పురస్కరించుకుని రిమ్స్ బ్లడ్ బ్యాంక్‌లో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దాదాపు 30 మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేయగా.. వారిని రిమ్స్ డైరెక్టర్ అభినందించారు.

ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించాల్సిందే

● వేలాదిగా తరలివచ్చిన కదం తొక్కిన ఆదివాసులు ● ఇంద్రవెల్లిలో ఆదివాసీలు భారీ ర్యాలీ


భారీ ర్యాలీతో మార్కెట్ యార్డుకి వస్తున్న ఆదివాసీలు

ఇంద్రవెల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించే దాకా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు కొట్నాక్ విజయ్‌కుమార్ అన్నారు. లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ బుధవారం తొమ్మిది తెగలకు చెందిన ఆదివాసీలు వేలాది సంఖ్యలో తరలి వచ్చి అమర వీరుల స్థూపం నుంచి ఆదివాసీ సంప్రదాయ వాయిద్యాల మధ్య స్థానిక మార్కెట్ యార్డు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలోని స్థానిక మార్కెట్ యార్డులో ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1976లో అప్పటి ప్రభుత్వం తాత్కాలికంగా విద్య పరంగా అప్పటి రాజకీయ నాయకులు తమ స్వప్రయోజనాల కోసం వెనుకబడిన వారు అనే నెపం తీసుకు వచ్చి కేవలం తాత్కాలికంగా డీఎన్‌టీ (డీనోటిఫైడ్ ట్రైబ్)లుగా అ వకాశం ఇస్తే అదే అదనుగా చూసి ఎస్టీలుగా చెలమణి అవుతూ రాష్ట్రంలో ఆదివాసీలకు అందించాల్సిన అభివృద్ధి ఫలాలు రిజర్వేషన్లు అన్ని లంబాడీలే అనుభవిస్తున్నారని ఆరోపించారు. ఆదివాసీ నాయకులపై లంబాడీ నాయకులు విమర్శలు చేస్తే ఉర్కునేదిలేదన్నారు. ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించే దాకా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని చెప్పారు. ఉద్యమ కార్యాచరణ ప్రకారం దశల వారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. ఏజెన్సీలోని లంబాడీలకు జీవో 24 ప్రకారం ఏజెన్సీ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వొద్దని, ఇచ్చిన వాటిని రద్దు చేయాలన్నారు. ఈ సభలో పలు తీర్మానాలను చేశారు. రాష్ట్రంలో లంబాడీలకు కుల ధృవీకరణ పత్రాలు, ఏజెన్సీ ధ్రువీకరణ పత్రాలను నిలిపివేయాలని, సుప్రీం కోర్టు తీర్పు వచ్చేంత వరకు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకూడదని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో గోండ్వానా రాయిసెంటర్ జిల్లా మేడీ మెస్రం దుర్గు పటేల్, తుడుం దెబ్బ ఉమ్మడి రాష్ట్రాల అధ్యక్షులు అరుణ్ కుమార్, తుడుం దెబ్బ రాష్ట్ర కో కన్వీనర్ గోడం గణేష్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పూర్క బాపురావు, ఆదివాసీ సేన రాష్ట్ర అధ్యక్షులు కోవా దౌలత్ రావు, తుడుం దెబ్బ మహిళ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు పెందోర్ పుష్పరాణి, తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షులు పెందోర్ దాదిరావ్, ఆంధ్ ఆదివాసీ సేవా సంఘం జిల్లా అధ్యక్షులు ముఖడే విష్ణు, జిల్లా ప్రధాన కార్యదర్శి గేడం భారత్, మండల అధ్యక్షులు పూర్క చిత్రు, గౌరవ అధ్యక్షులు జుగ్నాక్ భారత్ పాల్గొన్నారు.

● **ఆదివాసి సభకు పోలీస్ బందోబస్తు**

ఉట్నూర్ అదనపు ఎస్పీ కాజల్ సింగ్ ఆధ్వర్యంలో ఉట్నూర్ సీఐ మడావి ప్రసాద్, స్థానిక ఎస్సై సాయన్న ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఎలాంటి సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

అపరిచితుడి చెర నుంచి తప్పించుకున్న బాలుడు


అధికారుల సంరక్షణలో ఉన్న బాలుడు

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఎనిమిది సంవత్సరాల బాలుడు అపరిచితుడి చెరనుంచి తప్పించుకుని తెలియని రైలు ఎక్కి ఆదిలాబాద్ కు చేరకున్న ఘటన బుధవారం చోటు చేసుకుంది. సదరు బాలుడిని బాలల సంరక్షణ అధికారులు చేరదీసి వివరాలు సేకరించడంతో ఘటన వెలుగులోకి వచ్చింది. జిల్లా బాలల సంరక్షణ అధికారి రాజేంద్రప్రసాద్ తెలిపిన వివరాల మేరకు... మల్కాజిగిరి బోడుప్పల్‌లోని చిలకానగర్‌కు చెందిన భరత్ అనే ఎనిమిదేళ్ల బాలుడు సికింద్రాబాద్ స్టేషన్‌లో రైలు ఎక్కి ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం కోసాయి స్టేషన్‌లో దిగాడు. బాలుడి తండ్రి పేరు చందు, తల్లి పేరు సునీతగా గుర్తించారు. అక్కడ ఆందోళనతో ఏడుస్తూ కూర్చున్న బాలుడిని చూసిన రైల్వే స్టేషన్ సిబ్బంది వివరాలు తెలుసుకున్నారు. తలమడుగు పోలీసులకు, రైల్వే పోలీసులకు బాలుడి గురించి సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న ఆదిలాబాద్ చైల్డ్ లైన్ ప్రతినిధులు కోసాయికి వెళ్లి బాలుడిని ఆదిలాబాద్ బాలరక్షక్ భవన్‌కు తీసుకువచ్చారు. తనను ఒక అపరిచితుడు మోటార్ సైకిల్‌పై కూర్చోబెట్టుకుని ఎక్కడికో తీసుకెళ్లాడని, అదే సమయంలో తాను తప్పించుకుని రైలు ఎక్కానని బాలుడు చెప్పినట్లు బాలల సంరక్షణ అధికారి పేర్కొన్నారు. కాగా బాలుడి గురించి మల్కాజిగిరి డీసీపీవో సిబ్బందికి సమాచారం ఇచ్చామని పేర్కొన్నారు. ఇందులో ష్యూర్ ఎన్‌జీఓ జిల్లా కో ఆర్డినేటర్ కిల్లారే వినోద్, చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ సతీష్ కుమార్, పీఓఎస్ఐసీ ఆర్.వినోద్, పాల్గొన్నారు.

పూలే దుంపతుల సేవలు చిరస్మరణీయం

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : బడుగుబలహీన వర్గాల అభ్యున్నతి, స్త్రీ విద్య, సాధికారత కోసం పూలే దంపతులు ఎనలేని కృషి చేశారని అఖిల భారత మాలీ మహాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పేట్కూలే అన్నారు. బుధవారం 152వ సత్యశోధక్ స్థాపన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎస్సీ కార్యాలయ ఆవరణలో పూలే దుంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అఖిల భారత మాలీ మహాసంఘం రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్ పెట్కులే మాట్లాడుతూ 24 సెప్టెంబర్ 1873లో సత్యశోధక సమాజాన్ని స్థాపించి సమసమాజ నిర్మాణం, స్త్రీ హక్కులు, సామాజిక న్యాయం, మూఢ నమ్మకాలు, సమాజంలోని రుగ్మాతలను దూరం చేయడానికి మహాత్మా జ్యోతి బా పూలే జీవితాంతం పాటుపడ్డారన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబన్న, రాష్ట్ర కోశాధికారి సతీష్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు విజయ్ వాడగురే, అనిల్, డాక్టర్ రమేష్, రాంకిష్, సావిత్రిబాయి పూలే మహిళ మండలి సభ్యులు మనిషా, కల్పన, అంజలి, సుహర్ష, అద్విక్ పాల్గొన్నారు.

మద్యపానం నిషేధించండి


ఎక్సైజ్ శాఖ సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న దేగామ గ్రామస్థులు

బజార్‌హత్నూర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బజార్ హత్నూర్ మండలంలోని దేగామ గ్రామంలో మద్యపానంతో యువత చెడుదారిన పడుతున్నారని, ఇది వారి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోందని గ్రామంలో అక్రమ విక్రయాలు నిలిపి వేయాలని కోరుతూ గ్రామస్థులు బుధవారం ఇచ్చోడలోని ఎక్సైజ్ శాఖ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. గ్రామంలో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు కొనసాగుతున్నాయన్నారు. దీంతో కుటుంబ కలహాలు, అనారోగ్య సమస్యలతో సత మత మవుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్తులు, యువకులు కలిసి గ్రామ పంచాయతీ తీర్మానం చేసి ముందుకెళుతు న్నామన్నారు. కాగా ఇదివరకే జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్‌కు, జిల్లా అబ్కారీ శాఖకు వినతి పత్రం అందించారు.


ఉట్నూర్‌లో అభివాదం తెలుపుతున్న దళిత నాయకులు

దళితులకు రాజ్యాంగ హక్కులు కల్పించాలి

● రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ఉట్నూర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని హెచ్‌కేజీఎస్ ఫంక్షన్ హాల్ నందు షెడ్యుల్డు కులాల పోరాట హక్కుల జేఏసీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర జేఏసీ కో కన్వీనర్ బొమ్మెర శ్రీనివాస్, గోడ రమేష్, సమత సైనిక్‌దళ్ రాష్ట్రనాయకులు దుర్గంనగేష్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఏజెన్సీలో దశాబ్దాలుగా ఎలాంటి హక్కులు లేకుండా కేవలం ఓటు వేయడానికి మాత్రమే పరిమితం అయ్యామని నాయకులు వాపోయారు. నిరంతర పోరాట ఫలితంగా హక్కుల సాధన సాధ్యమవుతుందని వక్తలు స్పష్టం చేశారు. సాగుభూమి, ఇండ్ల భూములకు హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీలో దళితులను నాన్ ట్రైబల్ సరసన కట్టొద్దని మేము సామాజిక, ఆర్థిక, సాంఘీక రాజకీయ అంశాల్లో అన్నింటిల్లో ట్రైబల్స్ కన్నా వెనుకబడి ఉన్నామని వక్తలు పేర్కొన్నారు. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ అచ్చుత రమేష్‌బాబు మాట్లాడుతూ ఏజెన్సీ దళిత సమస్యలు అధిష్టానం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ నాయకులు కొమ్ము‌విజయ్ పార్టీ ఇన్‌చార్జీ ద్వారా ఏజెన్సీ సమస్యల పై ఉద్యమం చేస్తామని అన్నారు.

ఆర్‌సెట్ ఆధ్వర్యంలో స్వయం ఉపాధి శిక్షణ

ఉట్నూర్, సెప్టెంబరు24 (ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ మండల కేంద్రంలోని కుమురం ప్రాంగణంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రంలో ఆసక్తి ఉన్న యువతి యువకులకు ఉచిత శిక్షణ ఇస్తున్నామని ఆర్‌సెట్ డైరెక్టర్ మొహమ్మద్‌గౌస్ ఒక ప్రకటనలో తెలిపారు. కుట్టు మిషన్, మగ్గం వర్క్‌లపై ఆసక్తి ఉన్న యువతీ, యువకులకు అక్టోబరు 8 నుంచి శిక్షణ కార్యక్రమాలు ప్రారంభిస్తున్నామన్నారు. అప్పటిలోగా ఆసక్తి ఉన్న వారు 18 ఏళ్లు నిండిన వారు, పదవ తరగతి పాస్ లేదా ఫెయిల్ అయిన వారు, అక్టోబర్ 5లోగా కొమురం ప్రాంగణంలో ఉన్న ఆర్‌సెట్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. భోజన వసతి కల్పించడంతో పాటు రాను పోను చార్జీలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. శిక్షణ అనంతరం ధ్రు వీకరణ ప త్రాలు ఇస్తామన్నారు. ఆసక్తి నిజ ధృవపత్రాలు, రెండు ఫోటోలు, ఆధార్ కార్డు, పాన్‌కార్డు, బ్యాంకు పాస్‌పుస్తకం జిరాక్స్ బ్యాంక్ ఖాతా నెంబర్ ధృవీకరించాలన్నారు. అదనపు వివరాల కోసం 99494 12159, 89656 33226., 94415 30494, 80960 93085 లలో సంప్రదించాలన్నారు.

కొనసాగుతున్న నిరవధిక సమ్మె


ఉట్నూర్‌లో 13వ రోజు సమ్మె చేస్తున్న దినసరి ఉద్యోగులు

ఉట్నూర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలంటూ మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం ముందు దినసరి ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తలపెట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతుంది. బుధవారం నాటికి 13 రోజుకు చేరింది. ఏడు నెలల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని, దసరా పండుగ, దీపావళి పండుగ వస్తుందని, బతుకమ్మల సంబరాలు ఇప్పటికే తమ తమ గ్రామాలలో ప్రారంభమయ్యాయని అయినా కూడా తాము సమ్మె శిబిరంలో ఉండిపోవాల్సి వస్తుందని దినసరి ఉద్యోగులు వాపోతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ అధికారులు తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలంటూ ఉద్యోగుల సంఘం నాయకులు ఏరుకొండ రాజన్నమాణిక్‌రావు, రాథోడ్‌బాపురావులు కోరుతున్నారు.

యాదిలో..

చిన్నతనంలో సందడి అంతా ఇంతా కాదు



- ఆవుల శ్రీదేవి, కైలాష్ నగర్, ఆదిలాబాద్

బతుకమ్మ పండుగ వచ్చిందంటే చిన్ననాటి జ్ఞాపకాలే గుర్తుకు వస్తాయి. ఇంటిల్లిపాదీ పూలను సేకరించే పనిలో నిమగ్నమయ్యేవాళ్లం. సేకరించిన పూలతో అందంగా బతుకమ్మను పేర్చి గడ్డెల వద్దకు తీసుకెళ్లి వేడుకలు జరుపుకునేవాళ్లం. తొమ్మిది రోజులు తొమ్మిది నిమిషాల లాగా గడిచిపోయేవి. స్నేహితులు, బంధు మిత్రులతో సరదగా గడిపిన ఆ రోజులు ఎన్నటికీ మరవలేము.

తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చేవాళ్లం



● ఏలేటి సునీతారెడ్డి

మా చిన్నతనంలో తీరొక్క పూలను స్నేహితురాళ్ళతో కలిసి సేకరించి బతుకమ్మను పేర్చేవాళ్లం. ఇంట్లో దొరికే పూలతో పాటు పంట పొలాలకు వెళ్లి స్వయంగా పూలను కోసి తీసుకొచ్చే వాళ్లం. చప్పట్లు కొడుతూ పల్లె పాటలను పాడుతూ బతుకమ్మ ఆడే వాళ్లం. మా అమ్మ ఏటేటి గంగవ్వ పాడిన ఉయ్యాలో పాటను ఎక్కువగా పాడుకునే వాళ్ళం అప్పట్లో సంస్కృతి సాంప్రదాయాలు, భక్తిశ్రద్ధలతో బతుకమ్మను పూజించేవాళ్లం.

స్త్రీత్వానికి ఐక్యత మహిళల గౌరవానికి ప్రతీక



● ఘులే శిల్ప, కానిస్టేబుల్, బజార్ హత్నూర్

బతుకమ్మ పండగ స్త్రీత్వానికి, ఐక్యతకు, మహిళల గౌరవానికి ప్రతీకగా నిలుస్తుంది. తెలంగాణ ఆడపడచుల సాంస్కృతిక వారసత్వం. ఈ పూల పండగ తెలంగాణ సంస్కృతికి, సంప్రదాయాలకు అద్దం పడుతుంది. రంగు రంగుల పూలను అందంగా పేర్చి, దైవస్వరూపంగా పూజించడం ఒక ప్రత్యేకత. ఈ బతుకమ్మ పండగతో మా అందరిలో ఆనందం, ఉత్సాహాన్ని నింపుతుంది.



రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



మృతి చెందిన బలిరాం

ఉట్నూర్, సెప్టెంబరు24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శంకర్‌తండా సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. శంకర్‌తండాకు చెందిన జాదవ్‌బలిరాం (73) మంగళవారం శంకర్‌తండా నుంచి తమ్ముని భార్యను చికిత్స కోసం హస్నాపూర్ ఆసుపత్రికి తీసుకెళ్లి తిరిగి వస్తుండగా శంకర్ తండా గ్రామానికి వెళ్తున్న సమయంలో వెనుక నుంచి అతివేగంగా వచ్చిన మాక్స్ బులోరో వాహనం ద్విచక్ర వాహనం పై వెళ్తున్న జాదవ్‌బలిరామ్, జాదవ్ మల్లేశ్వరిలను వెనుక నుంచి ఢీకొట్టడంతో ఇద్దరు కింద పడిపోయినప్పటికి వాహనం డ్రైవర్ అతివేగంగా వెళ్లి పోయారని గ్రామస్తులు తెలిపారు. తీవ్రంగా గాయపడిన బలిరాము, మల్లీశ్వరిలను ఉట్నూర్ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స నిర్వహించిన అనంతరం అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం డాక్టర్లు ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రికి రెఫర్ చేశారని కుటుంబ సభ్యులు తెలిపారు. రిమ్స్ ఆస్పత్రి నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో బలిరాం తుదిశ్వాస విడిచారని కుటుంబ సభ్యులు తెలిపారు. రోడ్డు ప్రమాదంపై ఉట్నూర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్సై ప్రవీణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ తీగలకు తగిలి రైతు మృతి

● బావోజీపేట్‌లో ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన

ఇచ్చోడ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పండించిన పంటలను కాపాడుకునేందుకు పంటపొలాలకు విద్యుత్ తీగలను అమర్చిన ఓ రైతు ప్రమాదవశాత్తు తగిలి మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. స్థానికులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇచ్చోడ మండలంలోని బావోజీపేట్ గ్రామానికి చెందిన మండాడి రంబు (50) శనివారం తన పొలానికి వెళ్లాడు. పక్కనున్న చిక్రం పాండు తన పొలంలో ఏర్పాటు చేసిన విద్యుత్ కంచెకు తగిలి రంబు అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పాండు ఏంచేయాలో తెలియని పరిస్థితిలో భయంతో మృతదేహాన్ని సమీపంలోని వాగులో పడేశాడు. రంబు ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఎక్కడ వెతికినా ఆచూకి దొరకలేదు. రంబు ఆచూకి తెలియకపోవడంతో అనుమానంతో పొలానికి వెళ్లి పరిశీలించారు. అక్కడ విద్యుత్ తీగలకు తగిలి చనిపోయినట్లు గుర్తించిన గ్రామస్థులు పాండును నిలదీశారు. తన తండ్రి అంత్యక్రియలకు సైతం చూసుకునే సమయం ఇవ్వలేదని తన కూతురు మంగళవారం ఇచ్చోడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీతో బుధవారం పూడ్చిన మృతదేహాన్ని బయటకి తీసి రీ పోస్టుమార్టం నిర్వహించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసుకున్న పోలీసులు విచారణ చేపడుతున్నట్లు తెలిపారు.

గుండె పోటుతో వ్యక్తి మృతి

నార్నూర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో బాబేఝరి గ్రామానికి చెందిన ఊర్ వతే ఆనంద్ రావు(40) గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆనంద్‌రావు కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలతో ఇంటి దగ్గర బాధ పడ్తున్నాడు. బుధవారం ఉదయం నార్నూర్ ప్రభుత్వ ఆస్పత్రి వైద్యం కోసం కుటుంబీకులు తీసుకోని వచ్చారు. గుండె పోటు వచ్చిందని, వైద్య సిబ్బంది వైద్యం అందించే సమయంలో మృతి చెందారు.

సామాజిక అణచివేతకు వ్యతిరేకంగా పోరాడుదాం

● సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పద్మశ్రీ



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎం.పద్మశ్రీ

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సమాజంలో మహిళల పట్ల చూపుతున్న లింగ వివక్షత సామాజిక అణచివేతలకు వ్యతిరేకంగా ఆర్థిక దోపిడీకి వ్యతిరేకంగా శ్రామిక మహిళా లోకం ఐక్య పోరాటాలకు సన్నద్ధం కావాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎం.పద్మశ్రీ అన్నారు. పట్టణంలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన శ్రామిక మహిళా జిల్లా సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా శ్రామిక మహిళ నాయకురాలు విమల రణదివే చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించిన అనంతరం ప్రసంగించాం. మహిళలు ఎదుర్కొంటున్న ప్రత్యేక సమస్యలు ఆర్థిక అసమానతలు సామాజిక అణిచివేత పని భద్రత సమాన పనికి సమాన వేతనం జీతభత్యం లేని శ్రమ తదితర సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వాలు చిత్తశుద్ధిని ప్రదర్శించడం లేదని పద్మశ్రీ అన్నారు. పని ప్రాంతాల్లో వేధింపులను నిరోధించే అంతర్గత కమిటీలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నవంబర్ 1, 2 తేదీల్లో అఖిల భారత శ్రామిక మహిళా సదస్సును హైదరాబాద్ లో నిర్వహించనున్నమని, శ్రామిక మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బొజ్జ ఆశన్న, అన్నమొల్ల కిరణ్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు డి.వెంకటమ్మ, నాయకులు ఆర్.సురేందర్, శ్రామిక మహిళా నాయకులు విద్య, గంగమ్మ, జంగుబాయి, పద్మ, పార్వతి, సౌజన్య, అరుణ, మనోజ, స్నేహ, పావని పాల్గొన్నారు.

ఎరువులు అధికంగా వాడితే అనర్థమే: ఏవో



పీఏసీఎస్‌లో యూరియా పంపిణీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏవో కృష్ణవేణి

నేరడిగొండ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మోతాదుకు మించి ఎరువులు (యూరియా) వాడితే అనర్థమేనని ఏవో కృష్ణవేణి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘంలో యూరియా పంపిణీ కేంద్రాన్ని పరిశీలించారు. ప్రతి రైతుకు సకాలంలో యూరియా అందేలా చర్యలు చేపడుతున్నామన్నారు. రైతులు బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘంలో యూరియా పంపిణీ కేంద్రాన్ని పరిశీలించారు. ప్రతి రైతుకు సకాలంలో యూరియా అందేలా చర్యలు చేపడుతున్నామన్నారు. రైతులు మోతాదుకు మించి ఎరువులు వాడడం వల్ల భూసారం దెబ్బతింటుందన్నారు. వ్యవసాయ అధికారులు సిఫార్సుల మేరకు ఎరువులను వాడాలని కోరారు. పంటలకు చీడపీడలు సోకినట్లయితే సంబంధిత వ్యవసాయ విస్తీర్ణ అధికారులను సంప్రదించి వారి సలహాలు సూచనల మేరకే మందులను పిచికారి చేసుకోవాలన్నారు. ఆమె వెంట వ్యవసాయ విస్తీర్ణ అధికారులు శ్యాం సుందర్ సౌజన్య, సీఈవో నాగభూషణ్ ఉన్నారు.

సిమెంట్ ఫ్యాక్టరీ పరిహారం విషయంలో రైతులకు అన్యాయం

● పరిహారం చెల్లించాలని డిమాండ్..

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రేణుక సిమెంట్ ఫ్యాక్టరీ భూ నిర్వాసితులకు ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం పరిహారం అందించాలని రైతు సంఘం అధ్యక్షులు బండి దత్తాత్రి డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రైతులు, కంపెనీ ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేయగా రైతులకు అందిన నోటీసుల పట్ల నిరసన తెలిపారు. రూ.8 లక్షల 59 వేలతో ఎకరానికి పరిహారం ఇస్తామని నోటిసులు అందడంతో కాన్ఫరెన్స్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టి నినాదాలు చేశారు. రైతులకు మాజీ ఎంపీపీ గండ్రత్ రమేష్ మద్దతుగా నిలిచి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రేణుకా సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణం కోసం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని పలు గ్రామాల రైతుల నుంచి భూములను స్వీకరించారని, ఆ సమయంలోనే రూ.9 లక్షల 25 వేలు ఇచ్చారన్నారు. కానీ ఇప్పుడు దాన్ని మరో లక్ష తగ్గించి రూ.8 లక్ష ల 59 వేలకు ఇస్తామని అధికారులు నోటిసులు ఇవ్వడం సరి కాదన్నారు. ఆయా గ్రామాలకు చెందిన 30 మంది రైతులకు నోటిసులు ఇచ్చారని తెలిపారు. ప్రస్తుతం అక్కడ మార్కెట్ విడుదల దాదాపు రూ.40 నుంచి రూ.50 లక్షల వరకు ఉందని, దాని ప్రకారం పరిహారం ఇస్తేనే భూములు ఇచ్చేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారన్నారు.

రోడ్డు పూర్తి కావడంతో గ్రామస్థుల హర్షం



పెద్దగూడకు రోడ్డు వేయడంతో వెళ్తున్న గ్రామస్థులు

బోథ్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సోనాల మండలంలోని చింతల బోరి గ్రామం పరిధిలో పెద్దగూడకు రోడ్డు వసతి లేకపోవడంతో స్థానిక శాసనసభ్యులు జాదవ్ అనిల్ చొరవతో బుధవారం రోడ్డు పూర్తి చేసుకున్నారు. గ్రామానికి వెళ్లే రోడ్డు నడిచేందుకు వీలు లేకుండా పోవడంతో గ్రామస్తులు సమస్యను ఎమ్మెల్యే విన్నవించగా ఎమ్మెల్యే ఆదేశాలతో ఆయన అనుచరులు రోడ్డు పూర్తి చేశారు. గిద్దె విజయ్ కుమార్, కాగ్ని రవికాంత్, ఈశ్వర్, కేంద్రీ ఓం ప్రకాష్‌తో కలిసి రోడ్డు చేసుకున్నారు.

ఆపరేషన్ దేశీదార్

(5వ పేజీ తరువాయి)..

దేశీదారు అక్రమమద్యం నిల్వలు భారీగా పట్టుబడుతున్నాయి. కొన్ని గ్రామాల్లో వీడీసీలు బెల్ట్‌షాపులతో పాటు దేశీదారు మద్యం అమ్మకాల కోసం కూడా టెండర్లను నిర్వహిస్తున్నట్లు తెలుస్తుంది. గ్రామస్థుల సహకారం ఉండడంతో దేశీదారు మద్యం అమ్మకాలకు అడ్డుకట్ట పడడం లేదంటున్నారు. జిల్లాలో దేశీదారు మద్యం అమ్మకాలను అరికడితేనే ఎక్సైజ్ శాఖ టార్గెట్ చేరుకునే అవకాశం ఉందంటున్నారు.

అడ్డదారుల్లో సరఫరా

మహారాష్ట్ర నుంచి అడ్డదారుల్లో జిల్లాకు అక్రమ మద్యాన్ని సరఫరా చేస్తూ అమ్మేసుకుంటున్నారు. సరిహద్దు గ్రామాలైన జైనథ్ మండలం ఆనంద్‌పూర్, పెండల్‌వాడ, కౌట, బీంపూర్ మండలం అర్లి, వడూర్, అందర్‌బంద్, కరంజి, ఆదిలాబాద్‌అర్బన్, వడ్డెరబస్తీ, సుందరయ్యనగర్, ఖుర్షిద్‌నగర్‌లలో ముమ్మర తనిఖీలను నిర్వహిస్తూ అనుమానితులను అదుపులోకి తీసుకుంటున్నారు. రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ బృందాలు సరిహద్దుల్లో ముమ్మర తనిఖీలను నిర్వహిస్తున్నాయి. మహారాష్ట్ర నుంచి జిల్లాలోకి తరలించే అక్రమ మద్యాన్ని అరికట్టేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. అయిన రాత్రిళ్లు గుట్టు చప్పుడుకాకుండా పెన్‌గంగా మీదుగా కాలి నడకన దేశీదారు మద్యాన్ని జిల్లాకు పెద్ద ఎత్తున తరలిస్తున్నట్లు తెలుస్తుంది. ముందే ఆర్డర్లను తీసుకుంటున్న వ్యాపారులు మద్యం విక్రయదారులకు సరఫరా చేస్తూ కమిషన్ దండుకుంటున్నారు.

నేతల ముందు చూపు

స్థానిక ఎన్నికల హడావిడి మొదలు కావడంతో ముందస్తుగా మద్యాన్ని నిల్వ చేసుకునేందుకు నేతలు ముమ్మర ప్రయత్నాలు మొదలు పెట్టారు. గ్రామాల్లో విచ్చలవిడిగా డంపులు చేస్తూ ఎన్నికల్లో మద్యం పంపిణీకి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే భారీగా దేశీదారు మద్యం పట్టుబడుతున్నట్లు తెలుస్తుంది. ఆర్డర్లపై మహారాష్ట్రకు చెందిన లిక్కర్ వ్యాపారులు నేరుగా దేశీదారు మద్యాన్ని జిల్లాకు తరలిస్తున్నారు.ముందే వ్యాపారులతో ఒప్పందం చేసుకుంటున్న నేతలు తమ చేతికి మట్టి అంటకుండా జాగ్రత్త పడుతున్నారు. మహారాష్ట్ర వ్యాపారులు దసరా, స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పెద్ద మొత్తంలో ఆఫర్లు ఇస్తున్నారు. దీంతో భారీగా మద్యాన్ని కొనుగోలు చేసేందుకు నేతలు ప్రయత్నాలు చేస్తునట్లు తెలుస్తుంది.

సరిహద్దు గ్రామాలపై ప్రత్యేక నిఘా

● విజేందర్ (ఎక్సైజ్ సీఐ, ఆదిలాబాద్)



దసరా పండుగను దృష్టిలో పెట్టుకుని గత కొద్ది రోజులుగా స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నాం. ముఖ్యంగా సరిహద్దు గ్రామాలపై ప్రత్యేక నిఘాను సారిస్తున్నాం. మద్యం అమ్మకాలు జరుపుతున్న వ్యాపారులను అదుపులోకి తీసుకుంటున్నాం. రాష్ట్ర స్థాయి టాస్క్‌ఫోర్స్ అధికారులతో కలిసి దాడులు నిర్వహిస్తున్నాం. దేశీదారు మద్యాన్ని విక్రయిస్తూ వరుసగా మూడుసార్లు పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తున్నాం. అలాగే లక్ష రూపాయల జరిమానా విధిస్తున్నాం.

గడ్డెన్న వాగు కాలువలో పడి ఒకరి మృతి

లోకేశ్వరం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : గడ్డెన్న వాగు కాలువలో పడి మృతిచెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. బీహార్‌కు చెందిన వినోద్ సహని (35) బతుకుదెరువు కోసం రాజేష్ బాబు తండాలోని పీఎన్‌ఆర్ రైస్ మిల్లులో కూలీ పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈ నెల 23వ తేదీన రాత్రి 10 గంటల ప్రాంతంలో గులాబ్ సహని అనే అతనితో పుస్పూర్‌లో మద్యం సేవించి, అక్కడి నుంచి రాజేష్ బాబు తండాకు వెళ్లే క్రమంలో గడ్డెన్న వాగు కాలువలో మద్యం మత్తులో ప్రమాదవశాత్తు పడి మృతిచెందాడు. మృతుడి పెద్దనాన్న కొడుకు అయిన రాజ్‌గిర్ సహని ఫిర్యాదు మేరకు లోకేశ్వరం ఎస్సై అశోక్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించామని తెలిపారు.

పిడుగుపాటుతో గేదెల కాపరి మృతి

నిర్మల్ రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తల్వేద గ్రామానికి చెందిన సాకలి పోశెట్టి(52) గేదెలు మేపడానికి పాలేరుగా పని చేస్తుండేవాడు. మంగళవారం ఉదయం గేదెలను మేపడానికి వెళ్లాడు. నిర్మల్ పట్టణ శివారు మంజులాపూర్ పెద్ద చెరువు సమీపంలో గేదెలను మేపుతుండగా ఒక్కసారిగా పిడుపాటుకు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతకడంతో నీటిమడుగులో విగతజీవిగా పడి ఉన్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్ల ఉన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



కుటుంబంతో మృతుడు (ఫైల్)

భైంసా, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): భైంసాలోని పిప్రి కాలనీ క్రాస్ రోడ్డులో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ బుధవారం మధ్యాహ్నాం మృతి చెందాడు. టౌన్ సీఐ గోపినాథ్ తెలిపిన కథనం ప్రకారం ప్రమాద ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం రాత్రి వేళలో భైంసా రూరల్ పోలీసుల బృందం పెట్రో కారులో గస్తీ కోసం జాతీయ రహదారి పైకి వెళ్లింది. అక్కడి పిప్రి కాలనీ క్రాస్ రోడ్డు మార్గం మీదుగా జాతీయ రహదారి పైకి వెలుతున్న పెట్రోకారుకు భైంసా పట్టణం నుంచి పిప్రి కాలనీకు ద్విచక్ర వాహనం వెలుతున్న కోలవాడ్ ఉమేష్ (31) ఢీ కొట్టుకోవడంతో ఘటన చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న కోలవాడ్ ఉమేష్ (31)కు తీవ్ర గాయాలయ్యాయి. అలాగే పెట్రోకారులోనున్న పోలీసుకానిస్టేబులు లస్మన్నకు గాయాలయ్యాయి. క్షతగాత్రులిరువురిని వైద్యసేవల నిమిత్తం కోసం ముందుగా స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఇందులో కోలవాడ్ ఉమేష్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో అదే రోజు రాత్రి స్థానిక ఏరియా ఆసుపత్రిలో ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్య సేవల కోసం గాను హుటహుటిన నిజామాబాద్ ఆసుపత్రికి తరలించారు. మంగళవారం కోలవాడ్ ఉమేష్‌ను భైంసాలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్సలు నిర్వహించారు. చికిత్స పొందుతున్న యవవకుడు బుధవారం మృతి చెందాడు. మృతునికి భార్యతో పాటు మూడు సంవత్సరాలలోపు ఇద్దరు కుమార్తెలున్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

ఖానాపూర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బాధనకుర్తి గ్రామంలో స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న పారిశుధ్య పనులను ఎంపీడీవో రత్నాకర్ రావు పరిశీలించారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పకడ్బందీగా పారిశుధ్య పనులు చేపట్టాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అనంతరం గ్రామ పంచాయతీకి సంబంధించిన పలు రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి సురేందర్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

బాధితులకు సత్వర న్యాయం చేయాలి : ఎస్పీ



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

భైంసా, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వివిధ చటపరమైన సమస్యలతో పోలీసు స్టేషన్‌కు వచ్చే బాధితులకు పోలీసు అధికారులు కాలయాపనకు తావులేకుండా సత్వర న్యాయం అందేలా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ డా.జానకీ షర్మిల ఆదేశించారు. బుధవారం భైంసాలోని తన క్యాంపు కార్యాలయంలో గ్రీవెన్స్ డే సందర్భంగా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయా ఫిర్యాదులను సంబంధిత పోలీసు స్టేషన్ ఎస్ఐలకు వివరించి పరిష్కరించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దిశ, నిర్దేశం చేశారు. బాధితులకు చట్టపరంగా అవసరమైన సహాయాన్ని వెంటనే అందించాలని సూచించారు. ఇదే క్రమంలో గ్రీవెన్స్ డేలో భాగంగా ఇది వరకు స్వీకరించిన ఫిర్యాదులు,వాటిలో పరిష్కరించిన, పెండింగ్‌లోనున్న వాటిపై ఆయా పోలీసు స్టేషన్ల ఎస్ఐలతో సమీక్షించారు.పెండింగ్‌లోనున్న ఫిర్యాదులను జాప్యపు విధానాలకు తావులేకుండా పరిష్కరింప చేయాలని తెలిపారు. ఇందులో భైంసా అడిషనల్ ఎస్పీ అవినాష్ కుమార్, సబ్ డివిజన్ పరిధిలోని సర్కిల్ ఇన్స్‌పెక్టర్లు, పలు పోలీసు స్టేషన్ల ఎస్ఐలు పాల్గొన్నారు.

అక్రమ ఇసుక, పీడీఎస్ బియ్యం రవాణా నిందితుడి అరెస్ట్

నిర్మల్ టౌన్ : నిర్మల్ జిల్లాలో ఇసుక, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాతో పాటు ఎన్నో అక్రమాలకు పాల్పడుతున్న ప్రధాన నిందితుడు షేక్ రౌఫ్‌ను పట్టణ పోలీసులు అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. బుధవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... షేక్ రౌఫ్ అలియాస్ షేక్ రౌఫ్ రహీం అనే వ్యక్తి మహారాష్ట్రలోని ధర్మబాద్‌లో నివాసం ఉంటూ నిర్మల్‌తో పాటు చుట్టుపక్కల గల జిల్లాలో ఇసుక రవాణా చేయటంతో పాటు పీడీఎస్ బియ్యాన్ని పాలిషింగ్ చేసి ఎక్కువ ధరలకు అమ్మటం వంటి అక్రమాలు చేస్తుంటాడు. జిల్లాలో కొంత మంది సహాయంతో చట్ట వ్యతిరేక పనులు చేస్తూ ఉంటాడు. నిర్మల్ పోలీసులు పక్కా సమాచారంతో చాకచక్యంగా రౌఫ్‌ను పట్టుకున్నారు. ఆయా జిల్లాలలో పీడీఎస్ బియ్యాన్ని సేకరించి మహారాష్ట్రలో అజ్ఞాత ప్రాంతంలో కొన్ని మిల్లుల్లో ఆ బియ్యాన్ని సన్నగా పాలిషింగ్ చేసి కొన్ని బ్రాండ్ల పేరుతో అమ్ముతుంటాడు. షేక్ రౌఫ్ ఇసుకని తక్కువ రేటుకి కొని చుట్టు పక్కల గల జిల్లాలలో ఎక్కువ ధరికి అమ్మి తమ వల్ల ప్రభుత్వ ఖజానాకి నష్టం వస్తుందని తెలిసి కూడా ఇట్టి ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్నాడన్నారు. జిల్లాలోని భైంసా, బాసర, నిర్మల్‌లో పలు కేసులు నమోదైనట్లు వెల్లడించారు. సమావేశంలో ఏఎస్పీ రాజేష్ మీనా, టౌన్ సీఐ ప్రవీణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసిక ఉల్లాసం

● బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితీష్‌రాథోడ్

పెంబి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : క్రీడలు దేహదారుఢ్యానికి, మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితీష్‌రాథోడ్ అన్నారు. దసరా పండుగను పురస్కరించుకొని బుధవారం మండల కేంద్రంలో పెంబి ప్రీమియర్ లీగ్‌క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్రీడల వల్ల మానసిక ఉల్లాసంతో పాటు సంపూర్ణ ఆరోగ్యం సమకూర్చుతుందన్నారు. మారుమూల గ్రామంలో ఇంత పెద్ద క్రికెట్ టోర్నీ నిర్వహించడం, మండల క్రీడాకారులను అందరినీ ఒక దగ్గరకి చేర్చడం అభినందనీయమని నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు సల్ల నరేందర్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు సల్ల స్వప్నిల్ రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షులు ఐదు వెంకటేష్, మాజీ ఎంపీపీ సల్ల రామేశ్వర్ రెడ్డి, మాజీ సర్పంచ్ శేఖర్ గౌడ్, పెంబి మండల నాయకులు సల్ల ప్రశాంత్ రెడ్డి, బడుగు మల్లేష్, కే. విలాస్, తులాల శంకర్, గుగ్లావత్ సంతోష్, గంగాధర్, పుప్పాల మల్లేష్, పీపీఎల్ నిర్వాహకులు నరేష్, మతీన్, మహేష్, రాము, నాను, శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.

కీర్తి పురస్కార గ్రహీతలకు సన్మానం

నిర్మల్ కైన్‌గేట్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ పట్టణంలోని దామెర సాహితీ క్షేత్రంలో నిర్మల్ సాహితీ మిత్రమండలి ఆధ్వర్యంలో పలువురిని సన్మానించారు. ఇటీవల సురవరం ప్రతాప్ రెడ్డి తెలుగు యూనివర్సిటీ సాహితీ పురస్కారం స్వీకరించిన మునిమడుగుల రాజారావు (తాత్విక వ్యాసాలు), డా.తుమ్మల దేవరావు (చరిత్ర పరిశోధన)లను మెమొంటో, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి డా.దామెర రాములు మాట్లాడుతూ... మునిమడుగుల రాజారావు, డా. తుమ్మల దేవరావులు ఇద్దరు నిర్మల్ కీర్తిని ఇనుమడింపజేశారన్నారు. ఒకరు తాత్వికవ్యాసాలు రాస్తూ, మరొకరు మరుగున పడిన చరిత్రను వెలికి తీస్తూ.. వారి సాహిత్య, చారిత్రక జర్నీ వక్తలు ప్రసంగంలో ప్రస్తుతించారు. కార్యక్రమంలో డా. కృష్ణంరాజు, నేరెళ్ల హన్మంతు, అబ్బడి రాజేశ్వర్ రెడ్డి, డా. వేణుగోపాల్‌కృష్ణ, కుమ్మరి నాగారాం, పోలీస్ భీమేష్, నిర్మల్ నర్సింగ్ హోం సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిదండ్రులు విద్యార్థుల స్థితిని తెలుసుకోవాలి

లోకేశ్వరం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జూనియర్ కళాశాల లోకేశ్వరంలో 26వ తేదీన ఉదయం 10:30 గంటలకు అధ్యాపకులు, పోషకుల సమావేశం బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ సెక్రటరీ ఆదేశానుసారం రాష్ట్రవ్యాప్తంగా ఎంపీటీఎం మెగా పేరెంట్స్ టీచర్‌మీటింగ్ సుమారు 430 కళాశాలలో ఉండే విధంగా ఏర్పాటు చేశారని, దానిలో భాగంగానే మన లోకేశ్వరం కళాశాలలో నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ కే.గౌతమ్ తెలిపారు. సమావేశం రోజు విద్యార్థి మార్కుల పురోగతి, హాజరు శాతం, విద్యార్థి గుణగణాలు, విద్యార్థి బాగా ఏ అంశంలో ఏ రంగంలో రాణించగలరని అధ్యాపకులు తెలియజేస్తారన్నారు. ఆ తర్వాత ముఖాముఖి ఉంటుందన్నారు. ఇందులో భాగంగానే ఆ రోజు అధ్యాపకులు అందరూ విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న కళాశాలకు హాజరుకాని విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ఎంపీటీఎం ఇన్విటేషన్ ఆహ్వాన పత్రికలను అందజేశారు. ప్రతి ఒక్క తల్లిదండ్రులు బాధ్యతగా గుర్తించి కళాశాల నిర్వహించే పోషకుల సమావేశంలో పాల్గొని మీ విద్యార్థుల గురించి తెలుసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ముడుసు ఎల్లయ్య వర్ధంతి సభ

నిర్మల్ రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని స్థానిక విజయ పాథాలాజికల్ ల్యాబ్‌లో మానస సాహితీ సంస్కృతిక సేవ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమర యోధులు, తొలి తరం కమ్యూనిస్టు యోధులు ముడుసు ఎల్లయ్య వర్ధంతి సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మానస సంస్థ అధ్యక్షులు డాక్టర్ తుమ్మల దేవరావు మాట్లాడుతూ... ముడుసు ఎల్లయ్య స్వాతంత్ర్య సమర యోధుడిగా ఎన్నో పోరాటంలో భాగస్వాములయ్యారన్నారు.

ఇళ్ల నిర్మాణ పనుల పరిశీలన

ఖానాపూర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మస్కాపూర్ గ్రామ పంచాయతీలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణపనులను మండల ప్రత్యేక అధికారి జీవరత్నం బుధవారం పరిశీలించారు. ఇళ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రత్నాకర్ రావు, కార్యదర్శి కల్పన, తదితరులున్నారు.

నాణ్యమైన విత్తనాలు ఎంపిక చేసుకోవాలి

కుంటాల, సెప్టెంబరు, 24 : (ఆంధ్రజ్యోతి) : వరి పంటలో నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలని ముథోల్ ఏరువాక శాస్త్రవేత్తలు కార్తీక్ అన్నారు. బుధవారం మండలంలోని పెంచికల్‌పాడ్ గ్రామంలో వరిపంటను వారు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో నాణ్యమైన విత్తనం అనే కార్యక్రమంలో భాగంగా గ్రామానికి చెందిన కడెం మధుసుదన్‌కి ఖరీఫ్ సీజన్‌లో అధికారులు అందజేసిన డబ్ల్యూజీఎల్ 1246 వరి రకం పంట పొలాన్ని సందర్శించారు. ఈ రకం యొక్క విశిష్టత, విత్తనోత్పత్తిలో చేపట్టవలసిన జాగ్రత్తలను రైతులకు వారు వివరించారు. ఈ రకం వరి విత్తనాలను రాబోయే రోజుల్లో ఇతర రైతులకు కూడా అందజేయాలని రైతులు వారిని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈవో గణేష్ ఉన్నారు.

పనిముట్ల కోసం దరఖాస్తులు చేసుకోండి

ముథోల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వ్యవసాయ యాంత్రీకరణ పథకం 2025-26 (ఎస్‌ఎంఏఎం)లో భాగంగా వ్యవసాయ పనిముట్లకై రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి రచన ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో బ్యాటరీ స్ప్రేయర్స్, పవర్ స్ప్రేయర్స్, రోటవేటర్, స్ట్రా బేలర్, కేజీవీల్స్, పవర్ టిల్లర్స్ పవర్ వీడర్, బండ్ ఫార్మర్, సీడ్ కం ఫర్టిలైజర్ డ్రిల్, బ్రష్ కట్టర్ లాంటి వ్యవసాయ పనిముట్లు చిన్న, సన్నకారు, ఆసక్తి గల రైతులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సెంట్రల్ గవర్నమెంట్, స్టేట్ గవర్నమెంట్ కలిసి చిన్న, సన్నకారు మహిళా రైతులకు 50 శాతం సబ్సిడీ, పెద్ద రైతులకు 40 శాతం సబ్సిడీతో ఈ రాయితీని అందించనున్నారని పేర్కొన్నారు. ఈ రాయితీని పొందేందుకు మహిళల పేరు మీద భూమి నమోదై ఉండాలి. భూమి పాస్ బుక్, ఆధార్ కార్డు, ట్రాక్టర్ ఆర్‌సీ (ట్రాక్టర్ సంబంధిత పనిముట్లకు మాత్రమే) ఆసక్తి గల మహిళా రైతులు అప్లికేషన్ ఫారం తమ పరిధిలో ఉన్న వ్యవసాయ విస్తరణ అధికారికి అందించవలసిందిగా తెలిపారు.

కుల నిర్మూలనకు వ్యతిరేకంగా పోరాడుదాం

నిర్మల్ రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మహాత్మా జ్యోతిరావు పూలే కుల వ్యవస్థకు వ్యతిరేకంగా దాని నిర్మూలనకు లక్ష్యంగా సత్యశోధన సంస్థ ఏర్పాటు చేసి వ్యతిరేకంగా పోరాడారని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ పార్టీ జిల్లా కార్యదర్శి కే.రాజన్న అన్నారు. కార్యక్రమంలో రాజేందర్, రాజమణి, ముత్యం, లక్ష్మీ, రవి, తదితరులు పాల్గొన్నారు.

రైతు కార్మిక నీలి చట్టాలను తక్షణమే రద్దు చేయాలి

సారంగాపూర్ , సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రైతు కార్మిక నీలి చట్టాలను తక్షణమే రద్దు చేయాలని రాష్ట్ర ఏఐటీయూసీ కార్యదర్శి ఎస్ విలాష్ అన్నారు. బుధవారం సారంగాపూర్ నిర్మల్ మార్కెట్ కార్యాలయాలలో కార్మిక రాష్ట్ర మహాసభల కరపత్రాలను విడుదల చేసి ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 27న జరిగే రాష్ట్ర మహాసభలను కార్మిక సంగాల నాయకులు, కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని అన్నారు. కరపత్రాల కార్యక్రమంలో ముత్యం గంగాధర్ నర్సయ్య, గంగయ్య, భోజన్న, ఆశన్న, దామాజీ ఉన్నారు.

బతుకమ్మ సంస్కృతిని కాపాడుకుందాం

కడెం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : బతుకమ్మ పండుగలలో విష సంస్కృతి ప్రవేశించిందని, మహిళలు బతుకమ్మను చప్పట్లతో ఆడుతూ కాపాడుకోవాలని బుధవారం జననీ జన్మభూమి సంస్థ అధ్యక్షుడు కొమురవెల్లి భూమేష్ అన్నారు. మహిళలు డీజే సినిమా పాటలతో కాకుండా చప్పట్లు కొడుతూ పండుగని జరుపుకోవాలని విలేకరుల సమావేశంలో తెలిపారు. విష సంస్కృతిని అరికట్టాలని మహిళలను కోరారు.

విద్యానిధికి దరఖాస్తు చేసుకోండి

నిర్మల్ రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి కింద ఉన్నత చదువుల కోసం అందించే ఆర్థిక సహాయం కోసం ఈ నెల 23 నుంచి నవంబరు 19లోపు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి టి.దయానంద్ తెలిపారు. ఈ పథకం ద్వారా విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.20 లక్షలు మంజూరు చేస్తారని, వీసా, ఫ్లైట్ టికెట్ ఛార్జ్ ఇవ్వడం జరుగుతుందని, కుటుంబంలో ఒకరికి మాత్రమే వర్తిస్తుందని తెలిపారు.

యాదిలో..



లౌడ్ స్పీకర్లు లేవు.. మేమే పాడేవాళ్లం

నా చిన్నతనంలో అమ్మమ్మవాళ్ల ఇంటి వద్ద బతుకమ్మ పండుగ జరుపుకునేవాళ్లం. బతుకమ్మ బావి చుట్టూ మిత్రులతో కలిసి వలయం చుట్టూ పాటకు తగ్గట్టుగా అడుగులు వేస్తూ చప్పట్లు కొట్టేవాళ్లం. ఆ కాలంలో లౌడ్ స్పీకర్లు లేవు. మేమే పాటలు పాడేవాళ్లం. పొలాల నుంచి పూలను కోసుకొచ్చి, బతుకమ్మని పేర్చి డబ్బాల్లో సత్తిపిండి తీసుకెళ్లి ఆడేవాళ్లం. బతుకమ్మను పడుకోబెట్టే పాటపాడి ప్రసాదం తీసుకునేవాళ్లం. -లలిత, మాజీ వైస్ ఎంపీపీ, నిర్మల్ రూరల్



15 రోజులు సంతోషంతో వేడుకలు

మా అమ్మవారి ఊరైన ఖోడద్‌లో చిన్నప్పుడు అమ్మ, నాయనమ్మ, స్నేహితులు, గ్రామస్థులతో కలిసి అమావాస్య నుంచి పౌర్ణమి అయ్యే వరకు బతుకమ్మ ఆడుతుండే. ప్రకృతి ప్రసాదించే వివిధ రకాల పూలను సేకరించి సంతోషంగా బతుకమ్మలను తయారుచేసి సంస్కృతి ఉట్టి పడేలా వేడుకలు నిర్వహించేవాళ్లం. దసరాసెలవుల్లో అమ్మ వాళ్ల ఇంటికి వెళ్లినప్పుడు తప్పక వేడుకల్లో పాల్గొంటాను.

- పద్మ, లెక్చరర్,ప్రభుత్వ జూనియర్ కళాశాల, ముథోల్



స్నేహితులతో ఘనంగా జరుపుకొనేవాళ్లం

మా సొంతూరు కరీంనగర్. ప్రస్తుతం దోమకొండ ఎక్సైజ్ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్నా. స్థానిక మహిళలతో కలిసి బతుకమ్మ సంబరాల్లో పాల్గొంటున్నా. చిన్నప్పటి నుంచి బతుకమ్మ పండగను కుటుంబసభ్యులు, స్నేహితులతో ఘనంగా జరుపుకునేవాళ్లం. ఉద్యోగరీత్యా ఎక్కడ విధులు నిర్వహించినా మహిళలతో బతుకమ్మ ఆడతా.

- దీపిక, ఎక్సైజ్ ఎస్ఐ, దోమకొండ



28న పాదయాత్ర



పాదయాత్ర కరపత్రాలను విడుదల చేస్తున్న వైశ్య రక్షక్ ప్రతినిధులు

ఆదిలాబాద్‌టౌన్,సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి): దేవి శరన్నవరాత్రులను సందర్భంగా ప్రతి ఏటా మాదిరిగానే ఈ ఏడు సైతం వైశ్య రక్షక్ ఆధ్వర్యంలో ఈనెల 28న చలో దుర్గామాత ఆలయం పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు హిందూ సమాజ్ సమితి అధ్యక్షుడు హన్మండ్లు తెలిపారు. బుధవారం వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో పూజలు చేసిన అనంతరం పాదయాత్రకు సంబంధించిన కరపత్రాలు విడుదలచేశారు. దేవి నవరాత్రులను పురస్కరించుకుని 28న వైశ్య రక్షక్ ఆధ్వర్యంలో వాసవీకన్యకాపరమేశ్వరీ ఆలయం నుంచి సాయంత్రం 5గంటలకు పాదయాత్ర ప్రారంభమై దుర్గానగర్‌లోని అమ్మవారి ఆలయం వరకు కొనసాగుతుందని తెలిపారు. భక్తులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.



జడ్పీ మాజీ చైర్మన్ జనార్దన్ రాథోడ్‌ను ఆహ్వానిస్తున్న భవానీ భక్తులు

ఉత్సవాలకు ఆహ్వానం

ఉట్నూర్, సెప్టెంబరు24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పాత ఉట్నూర్‌లో నెలకొల్పిన దుర్గాదేవి మండపంలో జరుగుతున్న దుర్గాదేవి ఉత్సవాలకు రావాలని భవానీ భక్తులు జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ రాథోడ్‌జనార్దన్‌ను ఆహ్వానించారు. బుధవారం మండల కేంద్రంలోని మాజీ జడ్పీ చైర్మన్ ఇంటికి చేరుకుని ఉత్సవాలకు రావాలని కోరారు. ప్రత్యేక పూజలు ఉన్నాయని సతీమణిని వెంటబెట్టుకొని రావాలని కోరారు.



చెక్కులు ఇస్తున్న బీఆర్ఎస్ నేతలు

రూ.1.20కోట్లతో అభివృద్ధి

సిరికొండ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సహకారంతోనే సిరికొండ మండలం పథంలో దూసుకువెళ్తుందని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. సిరికొండకు చెందిన కవిత, కమలాబాయి, డొండే మహానందబాయికి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బుధవారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ నాయకులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ సహకారంతో మండలంలో రూ.1.20 కోట్ల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెంటన్న, షేక్ రంజానీ, చందు, లతీఫ్, రాజు, విజయ్, రోహిదాస్, మల్లారెడ్డి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యంగా పరిష్కరించుకుందాం

బోథ్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మాలలంతా ఐక్యంగా ఉండి తమ హక్కులను సాధించుకోవాలని మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కొప్పుల రమేష్ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో సంఘం మండల అధ్యక్షుడి ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ చేశారు. ఎస్సీ వర్గీకరణ వల్ల మాలలు నష్టపోయారని పేర్కొన్నారు. మనమంతా ఏకమై హక్కులను సాధించుకోవాలని పేర్కొన్నారు. జీవో 29 తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి చదువుల్లో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు మేకల మల్లన్న, వ్యవస్థాపక అధ్యక్షుడు దేవన్న, మాజీ అధ్యక్షులు సూరం భగవాన్, అసోసియేట్ అధ్యక్షులు పాశం రాఘవేందర్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కాపాడమ్మా.. కర్ర దుర్గమ్మా..!

- సిర్పెల్లి(హెచ్)లో అమ్మవారి ప్రత్యేక దర్శనం
- ఏటా పెరుగుతున్న భక్తుల తాకిడి
- నవరాత్రుల పాటు ఊరంతా ఉపవాస దీక్షలు

కుభీర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మహారాష్ట్ర సరిహద్దులో సిర్పెల్లి(హెచ్)లో ఏటా పర్యావరణ హిత కర్ర దుర్గమాత కొలువుదీరుతోంది. 13 ఏళ్ల కిందట గ్రామ పెద్దలు చూపిన పర్యావరణ పరిరక్షణ సూత్రాన్ని కొనసాగిస్తున్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, మట్టి ఇవేవీ లేకుండా కర్ర దుర్గామాతను ప్రతిష్ఠించి పూజలు చేస్తున్నారు. అమ్మవారి రాకతో తమ ఊరు మారిందని నమ్ముతూ ఏటా కర్ర మాతాజీనే ప్రతిష్ఠించి పూజలు చేస్తున్నారు. 9 రోజులు ముగియగానే నీళ్లు చల్లి ప్రత్యేక బాక్సులో విగ్రహాన్ని భద్రపరుస్తున్నారు.

● అందమైన రూపంలో అమ్మవారు

కుభీర్‌కు చెందిన పర్వత్‌వార్ సాయిశ్యాం, నరేష్‌ల తండ్రి పర్వత్‌వార్ శంకర్‌ను సిర్పెల్లి గ్రామసులు కోరగా.. పక్షం రోజుల పాటు నియమనిష్ఠలతో విగ్రహాన్ని తయారుచేశారు.



సిర్పెల్లిలో కొలువైన కర్ర దుర్గామాత

సింహం మీద కూర్చున్న అమ్మవారు కుడి చేతుల్లో ఖడ్గం, బాణం, శూలం, మరో చేతిలో దీవేన, ఎడమ చేతుల్లో త్రిశూలం, ఖడ్గం, గుణం, పూలు, ఈవిగ్రహ భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. కోర్కినకోర్కెలు నెరవేరడంతో ఏటా ఇక్కడికి భక్తుల తాకిడి పెరిగింది.

● ఊరంతా ఉపవాస దీక్షలే..

అమ్మవారిని ప్రతిష్ఠించినప్పటి నుంచి ఊరంతా ఉపవాసదీక్షలు చేపడుతారు. మద్యం, మంసాలకు దూరంగా ఉంటున్నారు. యువజన సంఘాలు, యువకులు అమ్మవారి మాలధారణ చేసి నియమనిష్ఠలతో ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు చేస్తారు.

● 9 రోజుల పాటు సేవలందిస్తాం

ఉత్సవాలు ముగిసే వరకు ఊరంతా భక్తిమార్గంలో ఉపవాస దీక్షలు చేపడతాం. గ్రామస్థులంతా ఐకమత్యంగా సేవలు చేస్తున్నాం. 9 రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పండగ జరుపుకుంటాం.

-లక్ష్మణ్, కమిటీ సభ్యుడు, సిర్పెల్లి(హెచ్)



● ఏర్పాట్లు పూర్తి చేశాం

అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల కోసం ఏర్పాట్లు పూర్తిచేశాం. రోజూ అన్నదాన ప్రసాదం అందిస్తున్నాం. రాత్రి వేళల్లో సంప్రదాయ, సాంస్కృతిక కార్యక్రమాలు చేపడుతున్నాం.

- రమేష్ కమిటీ సభ్యుడు, సిర్పెల్లి(హెచ్)



సౌత్ జోన్ అథ్లెటిక్స్‌లో మెరిసిన జాతర్ల వాసి

బజార్‌హత్నూర్ , సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఈనెల 23న ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులో జరిగిన 36వ సౌత్ జోన్ నేషనల్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో బజార్‌హత్నూర్ మండలవాసి బంగారు పతకం సాధించి ఆదిలాబాద్ జిల్లా పేరు నిలబెట్టారు. కిడ్స్ జావెలిన్ త్రోలో బజార్‌హత్నూర్ మండలంలోని జాతర్ల గిరిజన సంక్షేమ మోడల్ స్పోర్ట్స్ స్కూల్‌కు చెందిన కొట్నాక్ జకేష్ ఉత్తమ ప్రతిభ కనబర్చి బంగారు పతకం కైవసం చేసుకున్నాడు. కాగా కొట్నాక్ జాకేష్ అంతకుముందు రాష్ట్రస్థాయిలో హన్మకొండలో జరిగిన ఈవెంట్‌లలో 2 బంగారు పథకాలు సాధించాడు. అనతి కాలంలోనే గుంటూరులో జాకేష్ కిడ్స్ జావెలిన్ త్రోలో బంగారు పతకం సాధించి నేషనల్ లెవెల్ ఈవెంట్స్‌లో పాల్గొనే అవకాశం దక్కించుకున్నాడు. ఈ సందర్భంగా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, హెచ్‌ఎం కిషన్, కోచ్ సాహిల్ అభినందించారు. తనకు ఉపాధ్యాయులు, తన తండ్రి కొట్నాక్ జంగు ప్రోత్సాహంతోనే ఈస్థాయి వరకు వచ్చానని జాకేష్ అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. జాతీయస్థాయిలో రాణించాలనే పట్టుదలతో ఉన్నానని చెప్పాడు.



తండ్రి కొట్నాక్ జంగుతో బంగారు పతకం సాధించిన జాకేష్

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా

బోథ్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సోనాల మండలం సాకెరలోని దుర్గామాత ఆలయాన్ని బుధవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ మహిళలు ఎమ్మెల్యేను ఘనంగా స్వాగతించారు. ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఇప్పటికే అనేక గ్రామాలలో ఆలయాల కోసం నిధులు తీసుకొచ్చినట్లు చెప్పారు. ఆలయ అభివృద్ధికి తన వంతుగా రూ.30 వేలు అందించారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ సంధ్యారాణి, మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, డాక్టర్ స్వామి, మాజీ సర్పంచులు శ్రీధర్‌రెడ్డి, సదానంద్, సురేందర్ యాదవ్, నాయకులు దివాకర్‌రెడ్డి, ఈశ్వర్, భీమారావు, ప్రవీణ్, ప్రశాంత్ ఈశ్వర్ తదితరులున్నారు. అనంతరం సోనాలలో బీఆర్ఎస్ నాయకుడు సుధీర్‌రెడ్డి, సాకేరాకు చెందిన 2 కుటుంబాలను పరామర్శించారు.



సాకేరలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్

నేడు జూనియర్ కళాశాలలో పోషకుల సమావేశం

ఇచ్చోడ, సెప్టెంబరు, 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఉదయం 11:30 గంటలకు పోషకులు, అధ్యాపకుల సమావేశం ఉంటుందని కళాశాల ప్రిన్సిపల్ శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల విద్య ప్రగతిపై సమీక్ష ఉంటుందని విద్యార్థుల తల్లిదండ్రులు సమయానికి హాజరుకావాలని ఆయన సూచించారు. విద్యార్థుల చదువు, ఇతర అంశాలపై చర్చ ఉంటుందని పేర్కొన్నారు.

తాగునీటికి తంటాలు



నీరు రాని భగీరథ నలా

లక్ష్మణచాంద, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మునిపెల్లిలో తాగునీటికి తంటాలు పడుతున్నారు. మసీద్ సమీపంలోని అవాసాలకు భగీరథ నీరు సరిపడా రావడం లేదు. దీంతో ఓ బోరు బావిలో 1హెచ్‌పీ మోటార్ బిగించి నీటిని సరఫరా చేశారు. ఈ బోరు మోటార్ 6నెలల క్రితం కాలిపోయింది. అప్పటి నుంచి తాగునీటికి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. సొంత బోర్ బావి ఉన్న పొరుగింటికి వెళ్లి నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వెలిబుచ్చారు. అధికారులు స్పందించి నీటికష్టాలు తీర్చాలని వారు కోరుతున్నఆరు. ఈ విషయంపై ఎంపీడీవో రాధారాథోడ్‌ను వివరణ కోరగా.. నీటి సరఫరా, నిర్వహణ భగీరథ పథకం పరిధిలో ఉందని, సమస్యను పరిష్కరించాలని వారిని ఆదేశించామన్నారు.



పొరుగింటి నుంచి నీరు తెస్తున్న మహిళ

ఫిర్యాదుదారుల పట్ల బాధ్యతాయుతంగా మెలగాలి

పెంబి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండల పోలీస్ స్టేషన్‌ను బుధవారం నిర్మల్ ఏఎస్పీ రాజేష్ మీనా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల బాధ్యతయుతంగా వ్యవహరించి, వారికి భరోసా ఇవ్వాలన్నారు. అనంతరం ఇటీవల నమోదైన కేసులు, వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్‌లో రికార్డుల నిర్వహణ, పోలీస్ స్టేషన్ ఆవరణ, గార్డెన్, పోలీస్ స్టేషన్ నిర్వహణ బాగుందని ఎస్సై, సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఖానాపూర్ సీఐ అజయ్, పెంబి ఎస్సై హన్మాండు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఏఎస్పీ రాజేష్ మీనా

కొనసాగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాలు

నేరడిగొండ , సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా దేవీ శరన్నరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం అన్నపూర్ణ దేవి రూపంలో అమ్మవారు దర్శనమివ్వగా ఆయా గ్రామాలలో భక్తులు దుర్గాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు కుంకుమార్చన కార్యక్రమంలో పాల్గొన్నారు. నేరడిగొండలో అరవింద్‌రెడ్డి కుటుంబ సభ్యులు శ్రావణ్ కుమార్ జోషి మంత్రోచ్చారణ మధ్య ప్రత్యేక పూజలు చేశారు. బుద్దికొండలోని దుర్గాదేవి మండపాన్ని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మండపానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు భవాని మాత భక్తులు సన్మానించారు. భక్తులు మండపం వద్ద బోరు వేయించాలని కోరగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సానుకూలంగా స్పందించి తప్పకుండా బోర్ వేయిస్తానని హామీ ఇచ్చారు. మావలలోని వైష్ణవి గ్రీన్ వ్యాలీలో త్రిశక్తి దుర్గామాత ఆలయంలో కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి కుటుంబీకులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. కాలనీ వాసులు, వేదపండితులు ఆయనను అమ్మవారి శాలువాతో ఘనంగా సత్కరించి, ఆశీర్వదించారు.



బుద్దికొండలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే



పూజలో పాల్గొన్న శ్రీకాంత్‌రెడ్డి

కాంట్రాక్ట్ ఉద్యోగులకు వెంటనే జీతాలు చెల్లించాలి

నిర్మల్‌రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పలు శాఖల్లో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు వెంటనే జీతాలు చెల్లించాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు, అడ్వకేట్ జగన్‌మోహన్ డిమాండ్ చేశారు. పెండింగ్ వేతనాలపై ప్రభుత్వం నేటికీ స్పష్టమైన వివరణ ఇవ్వకపోయే సరికి నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారన్నారు. వివిధశాఖల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఆర్థికభారంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, దీనికి పూర్తి బాధ్యత ప్రభుత్వం వహించాలన్నారు. ముఖ్యమైన పండుగ దసరా పండుగ. కాని పండుగ పూట కూడా పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని, నేటికీ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు ఇప్పటికీ ఇవ్వడకపోవడం దారుణమని మండిపడ్డారు. ప్రభుత్వం ఇకనైనా కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని కోరారు.



కోలాటాలు ఆడుతున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా, విద్యార్థినులు



బతుకమ్మను ఎత్తుకున్న అదనపు కలెక్టర్ శ్యామలాదేవి

బతుకమ్మ సంబరం.. తాకే అంబరం

ఆదిలాబాద్‌టౌన్, సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి) : సంస్కృతి, సంప్రదాయాల ప్రాధాన్యతను భావి తరానికి తెలియచెప్పేలా పండగలను ఘనంగా జరుపుకోవాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. అధికారిక బతుకమ్మ సంబరాల్లో భాగంగా బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. బతుకమ్మ వద్ద గౌరమ్మకు ప్రత్యేక పూజలు జరిపిన అనంతరం ఉత్సవాలను ప్రారంభించారు. మహిళా అధికారులు, విద్యార్థులతో కలిసి సరదాగా కోలాటాలు ఆడుతూ.. బతుకమ్మ గీతాలకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ ఉత్సాహపరిచారు. అనంతరం విద్యార్థినులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ సలోని చాబ్రా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, డీఐఈవో గణేష్ జాదవ్, బీసీ డీడబ్ల్యూవో రాజలింగు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సూరజ్‌సింగ్ పాల్గొన్నారు. నార్నూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ సేవా పథకం దినోత్సవం సందర్భంగా బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, విద్యార్థులు, బతుకమ్మ పాటలపై సామూహిక నృత్యాలు చేశారు. ఎన్ఎస్ఎస్ అధికారి బాలాజీ కాంబ్లే, ప్రిన్సిపల్ కేశవులు, అధ్యాపకులు ఉదయ్ కుమార్, నరేష్, అజయ్ కుమార్, లింగంపల్లి సుజాత, వరుణ్‌రెడ్డి పాల్గొన్నారు.



నార్నూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బతుకమ్మ సంబరాలు



ఆదిలాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థినుల సందడి

బీఆర్ఎస్ ఖాళీ అవుతుంది



కంది సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్ఎస్ నేతలు

ఆదిలాబాద్, సెప్టెంబరు24 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ నియోజక వర్గంలో బీఆర్ఎస్ ఖాళీకావడం ఖాయమని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం ప్రజాసేవ భవన్‌లో బీఆర్ఎస్‌కు చెందిన పలువురు నేతలు కాంగ్రెస్‌లో చేరారు. పట్టణంలోని 18,19 వార్డులకు సంబంధించిన బీఆర్ఎస్ అధ్యక్షులు కార్తిక్, మతిన్, 15వ వార్డుకు చెందిన మహిళావిభాగం అధ్యక్షురాలు బబిత, రణదివ్యనగర్, గాంధీనగర్‌కు చెందిన పలువురికి కండువా వేసి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. తనపై నమ్మకం ఉంచి కాంగ్రెస్‌లో చేరిన వారందరిని కంటికి రెప్పలా కాపాడుకుంటానని కంది శ్రీనివాస్ పేర్కొన్నారు. కాంగ్రెస్ సిద్ధాంతాలు, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు ఆకర్షితులై పెద్దఎత్తున యువత పార్టీలో చేరుతుందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో గంగాధర్, సంతోష్, విఠల్, శ్రీధర్, సుధాకర్, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

రాష్ట్ర ప్రభుత్వం దూదేకుల సామాజికవర్గానికి రూ.లక్ష వడ్డీలేని రుణాలతో పాటు స్కూటీని ఇస్తామని సీఎం ప్రకటించడం పట్ల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో దూదెకుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రి జూపల్లికృష్ణారావు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.

బంతిపూలు పూసే.. అన్నదాత మురిసే

- తక్కువ పెట్టుబడి..ఎక్కువ ఆదాయం
- 100 రోజుల్లో చేతికి పంట
- బతుకమ్మ పండుగతో బంతి పూలకు భలే డిమాండ్

తలమడుగు , సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సంప్రదాయ పంటలకు స్వస్తి పలికి వ్యవసాయ అధికారుల సూచనలతో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం అందిచే పంటను వేసి ఆదర్శం గా నిలుస్తున్నారు రైతు కేమ పొచ్చన్న. వడ్డాడికి చెందిన రైతు తనకున్న మూడెకరాల భూమిలో ఎకరంలో బంతిపూల పంటను సాగు చేసేం దుకు ముందుకొచ్చారు. ఉద్యానవనశాఖ అధికా రులు అందించిన సలహాలు, సూచనలు పాటిం చారు. ఎకరానికి రూ.40 వేల నుంచి రూ.50 వేల పెట్టుబడి పెట్టి రూ.2 లక్షల ఆదాయం పొందారు. తన మిగతా భూమిలో ఎకరం కూరగాయలు, మరో ఎకరం ఆకుకూరలు, ఇంకొక ఎకరంలో బంతిపూలు వేసి ఎకరంలో రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల ఆదాయాన్ని సమకూర్చుకుంటున్నాడు. కేవలం 100రోజుల పంటను సాగు చేస్తూ లాభాలు గడిస్తున్నారు.



బంతి తోటలో పూలు కోస్తున్న రైతులు

బతుకమ్మ సీజన్ కావడంతో డిమాండ్..

ప్రస్తుతం బతుకమ్మ పండుగ సీజన్ కావడంతో బంతిపూలకు భలే డిమాండ్ పెరిగింది. కిలో బంతిపూలు రూ.100-150 ధర పలుకుతోంది. బతుకమ్మ పండుగ సీజన్ కావడంతో డిమాండ్ పెరగడంతో లాభాలను గడిస్తున్నారు. పూలు కావాల్సిన వారు పొచ్చెన్న పొలానికి వచ్చి కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. తలమడుగు, కొత్తూరు, లింగి, కుచులాపూర్‌లో ఇలాంటి రైతులు చాలామంది ఉన్నారు. వారికి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తే ఇంకొంత మంది రైతులు ముందుకొచ్చే అవకాశం ఉంది.

దుకాణాల్లో మున్సిపల్ అధికారుల తనిఖీ

ఖానాపూర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పలు దుకాణాలలో మున్సిపల్ అధికారులు బుధవారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను, 75 మైక్రాన్ల కన్నా తక్కువ ఉన్న ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. వాటిని ఉపయోగిస్తున్న పలువురు వ్యాపారులకు జరిమానాలు విధించారు. నిబంధనలు అతిక్రమిస్తే వాణిజ్య లైసెన్సులను సైతం రద్దు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ పోశెట్టి, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ చేతన్, సానిటేషన్ సూపర్‌వైజర్ మానాల శంకర్, సిబ్బంది ఉన్నారు.

నాలుగో సింహం యాక్షన్ ప్లాన్

జిల్లాలో ఇల్లీగల్ దందాలతో పాటు ఆన్‌లైన్ బెట్టింగ్, ఆన్‌లైన్ గేమింగ్‌ను పూర్తిగా నిరోధించేందుకు నిర్మల్ ఎస్పీ జానకిషర్మిల కొత్త కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. ఆపరేషన్ సెర్చ్ పేరిట ఎస్పీ ప్రత్యేక చర్యలను చేపడుతున్నారు. నిర్మల్‌లో కొంత కాలం నుంచి వ్యభిచారం, బెట్టింగ్, ఆన్‌లైన్ గేమింగ్‌లు, పేకాట జూ దంతో యువత అప్పుల పాలవడం అలాగే ఆత్మహత్యలు, హత్యలు లాంటి ఉదంతాలకు పాల్పడుతున్న సంఘటనలు పెరిగిపోయాయి. ఈ నేపథ్యంలో ఎస్పీ ఆ దిశగా దృష్టి కేంద్రీకరించారు.



ఎస్పీ ఆధ్వర్యంలో ఆపరేషన్ సెర్చ్

- **బెట్టింగ్ యాప్స్, అసాంఘిక కార్యకలాపాలు, సైబర్ నేరాలపై పోలీసుల నజర్**
- **అన్ని ప్రాంతాల్లో ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్ విస్తరణ**

నిర్మల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): యువతను వ్యభిచారం, బెట్టింగ్, ఆన్‌లైన్ గేమ్‌ల ఉచ్చు నుంచి బయటపడేందుకు ఎస్పీ విస్తృత స్థాయిలో ప్రచార కార్యక్రమాలకు రూపకల్పన చేశా రు. ముఖ్యంగా బెట్టింగ్‌పై నిఘాను విస్తృతం చేసేందుకు ప్రత్యేక సిబ్బందిని రంగంలోకి దించుతున్నారు. దీంతో పాటు బెట్టింగ్, ఆన్‌లైన్ గేమింగ్ ఎక్కువగా జరిగే ప్రాంతాలలో ఇన్‌ఫార్మర్‌లను సైతం నియమించేందుకు చర్యలు తీసుకోబోతున్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ ఆడుతూ నష్టపోతున్న యువత సమాచారాన్ని ఈ ఇన్‌ఫార్మర్‌ల ద్వారా తెలుసుకొని వారికి కౌన్సెలింగ్‌లు నిర్వహించాలని భావిస్తున్నారు. అయితే ఇన్‌ఫార్మర్ల సమాచారాన్ని అత్యంత రహస్యంగా ఉం చనున్నారు. ఎవరికి అనుమానం రాకుండా ఇన్‌ఫార్మర్లు అందించే సమాచారాన్ని సీరియస్‌గా తీసుకొని ప్రత్యేకంగా నియమించిన సిబ్బందిని రంగంలోకి దిగబోతున్నారు.


టెక్నాలజీతో ప్రాంతాల గుర్తింపు...

అందుబాటులో ఉన్న కొత్త టెక్నాలజీని ఉపయోగించి ఎక్కువగా బెట్టింగ్ జరుగుతున్న ప్రాంతాలను ఎస్పీ గుర్తించారు. నిర్మల్, భైంసా, ఖానాపూర్ పట్టణాల్లోని కొన్ని ఎంపిక చేసిన వార్డులలోనే కాకుండా మరికొన్ని గ్రామాలలో బెట్టింగ్, ఆన్‌లైన్ గేమింగ్‌లు ఎక్కువగా జరుగుతున్నట్లు గుర్తించారు. ఇలా గుర్తించిన తర్వాత ఈ ప్రాంతాలపై కొద్ది రోజుల నుండి నిఘా సైతం కొనసాగించారు. దీంతో ఎస్పీ ఈ వార్డులు, గ్రామాల్లో ఇక విస్తృత స్థాయిలో ప్రచార కార్యక్రమాన్ని చేపట్టేందుకు నిర్ణయించారు. స్థానిక పెద్దలతో పాటు అక్కడి యువజన సంఘాలు స్వచ్ఛంద సంస్థలను సైతం ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయబోతున్నారు.

దీంతోపాటు ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ యాప్‌లపై కూడా కొత్త టెక్నాలజీ ద్వారా ఇక నిరంతర నిఘాను చేపట్టనున్నారు.

వ్యభిచారం, పేకాట జూదం పైనా...

నిర్మల్ జిల్లాలో కొనసాగుతున్న వ్యభిచారం దందా తో పాటు పేకాట జూదంపైన ఎస్పీ దృష్టి కొనసాగిస్తున్నారు. బుధవారం నిర్మల్ జిల్లా కేంద్రం లోని ప్రధాన జన సామర్థ్య ప్రాంతమైన ఇందిరానగర్‌లో కొనసాగుతున్న వ్యభిచార ముఠాగుట్టు రట్టు చేశారు. ఎస్పీ తనకు అందిన రహస్య సమాచారం మేరకు కొద్ది రోజుల నుంచి ఓ ఇంట్లో సాగుతున్న వ్యభిచారం ముఠా కార్యకలాపాలపై నిఘా సారించారు. ఎస్పీ ఏర్పాటు చేసిన స్పెషల్ టీం సభ్యులు వ్యభిచారం కొనసాగిస్తున్న ఇంటిపై ఆకస్మికదాడి జరిపి ముగ్గురు వ్యభిచారిణిలతో పాటు విటులను సైతం అరెస్ట్ చేసిన వ్యవహారం సర్వత్రా చర్చనీయాంశమవుతోంది.



సైబర్‌క్రైమ్ పరిధిలోకి...

ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్‌లను సైబర్ క్రైమ్ పరిధిలోకి తీసుకువచ్చే చర్యలు చేపట్టనున్నారు. కొంతమంది ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్‌ల పేరుతో పెద్ద మొ త్తంలో అమాయకుల చేత పెట్టుబడులు పెట్టించేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఎస్పీ గుర్తించారు. అలాగే మరి కొంతమంది ఏజెంట్లుగా కూడా వ్యవహరిస్తూ అమాయకులను బలి పశువులను చేస్తున్నట్లు నిఘా వర్గాల ద్వారా తెలుసుకున్నారు. దీంతో బెట్టింగ్ ఆడే వారినే కాకుండా ఆడించే వారితో పాటు ఏజెంట్లపై కూడా దృష్టి సారించనున్నారు.

వాణిజ్యపన్నుల శాఖాధికారుల హల్‌చల్

- **భైంసాలో దుకాణాలు మూసివేసిన వ్యాపారులు**

భైంసా, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): భైంసాలో బుధవారం వాణిజ్య పన్నుల శాఖాధికారులు బంగారు, వెండి విక్రయకేంద్రాలపై ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. వాణిజ్యపన్నుల శాఖ సంయుక్త కార్యదర్శి టి.శ్రీనివాస్ ఆదేశాల మేరకు ఆ శాఖ పరిధిలోని డీసీటీవోలు సునీత, స్వేత, ఏసీటీవోలు శ్రీనివాస్,మహేష్ నేతృత్వంలోని బృందాలు తనిఖీలు చేపట్టేందుకు గాను ఉదయం ఇక్కడకు వచ్చాయి. సమాచారం అందుకున్న బంగారు, వెండి విక్రయ కేంద్రాల నిర్వాహకులు బెంబేలెత్తిపోయారు. తెరిచి ఉంచిన తమ తమ దుకాణాలను హడావిడిగా మూసివేసి అందుబాటులో లేకుండా పలాయనం చిత్తగించారు. అసద్‌బాబా నగర్ ప్రాంతంలో తెరిచి ఉన్న ఒక విక్రయ కేంద్రంలో వాణిజ్య పన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్ గోదావరి నేతృత్వంలోని బృందం తనిఖీలు చేపట్టింది. తనిఖీ అధికారుల బృందం రాకతో మార్కెట్ పరిధిలోని పాత, కొత్త దుకాణాల సముదాయలు మూసిఉన్నాయి. దీంతో అధికారుల బృందం తనిఖీలు చేపట్టే విషయంలో ఇక్కడి దుకాణాల సముదాయాల ముందు మకాం వేసి సమాలోచనలు జరుపుపుకున్నారు. జరుగుతున్న పరిణామాలను గమనించిన బంగారు, వెండి వర్తక సంఘం ప్రతినిధులు ముందుకు వచ్చి అధికారులతో భేటీ అయ్యారు. అధికార బృందం, వర్తక సంఘం ప్రతినిధులు సంఘ భవనంలో సమావేశమయ్యారు. ప్రతి వ్యాపారి విధిగా లైసెన్స్‌లు పొంది వ్యాపారాలు నిర్వహించుకోవాలని అధికారులు బృందం సూచించింది. వాణిజ్య పన్నుల శాఖ నియమ, నిబంధనలకు అనుగుణంగా క్రయ, విక్రయాల ప్రక్రియను నిర్వహించుకోవాలని తెలిపింది. పారదర్శకమైన రీతిలో క్రయ,విక్రయాల ప్రక్రియ కొనసాగాలని ఆదేశించింది. అనంతరం సంఘ కార్యవర్గ ప్రతినిధులను కొన్ని దుకాణాలు తెరిపించగా వాణిజ్య పన్నుల శాఖాధికారుల బృందం సంబంధిత దుకాణాలతో తనిఖీలు నిర్వహించినట్లుగా తెలిసింది.



ప్రతినిధులతో మాట్లాడుతున్న శాఖాధికారులు

చంద్రఘంటా అమ్మవారు



చంద్రఘంట అవతారంలో అమ్మవారు

బాసర, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : బాసర సరస్వతీ అమ్మవారి క్షేత్రంలో శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం మూడో రోజు బాసర సరస్వతీ అమ్మవారు చంద్రఘంటా అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

బాసర వద్ద గోదావరి

- **మహారాష్ట్ర నుంచి భారీగా ఇన్‌ఫ్లో**



బాసర వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి నది

బాసర, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : బాసర వద్ద మళ్లి గోదావరి ఉగ్రరూపం దాల్చింది. ఎగువన మహారాష్ట్ర నుంచి భారీగా వరద నీరు వస్తుండడంతో ఉధృతంగా ప్రవహిస్తుంది. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు లక్షల క్యూసెక్కులతో నీటిప్రవాహం శ్రీరామ్‌సాగర్ వైపు కొనసాగింది. బాసర వద్ద నది పూర్తి స్థాయి నీటి మట్టంతో ప్రవహించింది. భక్తులు స్నానాలు ఆచరించే ఘట్టాలన్నీ నీటమునిగాయి. శ్రీరాంసాగర్ బ్యాక్ వాటర్‌తో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అమ్మవారి ఆలయం నుంచి స్నాన ఘట్టానికి చేరే రహదారిపై గల లోతట్టు ప్రదేశంలో గల వంతెనను గోదావరి జలాలు ముంచెత్తాయి. దాదాపు నాలుగు అడుగుల వరకు నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. గోదావరి నదికి వెళ్లేవారు వంతెనవైపు నుంచి వెళ్లాల్సి వచ్చింది.

వరదలు రాకుండా చర్యలు తీసుకోవాలి

- **కలెక్టర్ అభిలాష అభినవ్**

నిర్మల్‌చైన్‌గేట్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ పట్టణంలో భవిష్యత్తులో వరదలు రాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో లేక్ ప్రొటెక్షన్‌పై సంబంధిత శాఖల అధికారులతో ఆమె సమీక్ష సమావే శం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఇటీవల భారీవర్షాల కారణంగా పలు కాలనీల్లో వరదలు సంభవించి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొ న్న విషయాన్ని ప్రస్తావించారు. ఇలాంటి పరిస్థితు లు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా డ్రైనేజీ వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. వరదల నియంత్రణలో సర్వే, రెవెన్యూ, మున్సిపల్, నీటి పారుదల శాఖలు సంయుక్తంగా సమన్వయంతో ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. పట్టణంలో వరదలు సంభవించడానికి గల ప్రధాన కారణాలను గుర్తించి, వాటి నివారణకు శాశ్వత పరిష్కారాలు చూపాలని కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఆర్. సుదర్శన్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, తహసీల్దార్లు రాజు, సంతోష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

ప్రోత్సాహకాలు..

జిల్లాలో జరుగుతున్న బతుకమ్మ సంబరాలను మరింత ఉత్సాహభరితంగా మార్చేందుకు కలెక్టర్ అభిలాష అభినవ్ కొత్త కార్యక్రమాన్ని ప్రారంభించారు. బతుకమ్మ వేడుకల సందర్భంగా మహిళలు, బతుకమ్మ గ్రూపులు తీసిన వీడియోలను కలెక్టరేట్ కంట్రోల్ రూమ్‌కి పంపితే, అందులో ఉత్తమమైన వాటిని ఎంపిక చేసి ప్రోత్సాహకాలు అందజేస్తామని కలెక్టర్ ప్రకటించారు. రెండు నిమిషాల లోపు నిడివి గల హై క్వాలిటీ వీడియోలను ఈ నెల 30లోగా పంపాలని సూచించారు. ఎంపికైన వీడియోలను జిల్లా అధికారిక సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో పోస్టు చేస్తామని తెలిపారు. ఆసక్తి గల వారు తమ వీడియోలను వాట్సాప్ నెంబర్ 9100577132కి పం పాలని కలెక్టర్ కోరారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులు పూర్తి చేయాలి

- **అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్**

నిర్మల్ చైన్‌గేట్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తిచేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై సంబంధిత అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలాల వారీగా ఇప్పటివరకు మంజూరైన ఇళ్లు, మా ర్కౌట్, బేస్మెంట్, తదితర అంశాలను సమీక్షించారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... ఈ నెల30 లోపు అనుమతులు పొందిన ఇందిరమ్మ ఇళ్లకు మార్కౌట్ ప్రక్రియ పూర్తి చేసి, వెంటనే నిర్మా ణ పనులు ప్రారంభించాలని ఆదేశించారు. సమావేశంలో హౌసింగ్ పీడీ రాజేశ్వర్, ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్

కొనసాగుతున్న నవరాత్రి ఉత్సవాలు



శాస్త్రినగర్ కొలువుదీరిన దుర్గామాత



చించాలలో 51 రకాల నైవేద్యం



లోకేశ్వరంలో దుర్గాదేవికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



కుంటాలలో మాలధారణ చేసిన భక్తులు

శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. మంగళహారతులతో దుర్గామాత మండపానికి వెళ్లి వేద పండితులచే ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ అమ్మవారికి ప్రీతిపాత్రమైన నైవేద్యాలను సమర్పిస్తున్నారు. మండలంలోని చించాల గ్రామంలో గల పెద్దమ్మ ఆలయంలో శరన్నవరాత్రులలో భాగంగా 51 రకాల నైవేద్యాన్ని సమర్పించారు. ● న్యూస్‌నెట్‌వర్క్

వ్యభిచార ముఠా గుట్టు రట్టు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ జానకీ షర్మిల

- **వివరాలు వెల్లడించిన ఎస్పీ**

నిర్మల్ టౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : గుట్టు చప్పుడు కాకుండా వ్యభిచారం చేస్తున్న ముఠా గుట్టును నిర్మల్ ఏఎస్పీ రాజేష్ మీనా, పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఛేదించినట్లు ఎస్పీ డాక్టర్ జి.జానకి షర్మిల బుధవారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో ఓ ఇంట్లో రహస్యంగా వ్యభిచారం నిర్వహిస్తున్నారని పక్కా సమాచారంతో ఆకస్మికదాడులు నిర్వహించి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. శాంతినగర్‌కి చెందిన నఫీస్ బేగం అమాయకమైన మహిళలను మాయ మాటలు చెప్పి వ్యభిచారలోకి డబ్బు ఆశ చూపి దిం పుతుందన్నారు. రోజు కొందరి మహిళలతో వ్యాపారం నడుపుతుంది. గతంలో కూడా సోఫీ నగర్ ప్రాంతంలో ఇలాగే వ్యభిచార గృహం నిర్వహించేదని, నిందితురాలితో పాటు బిల్కిస్ చాంద్, మమ్మద్ ఇర్షాద్‌లను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రెండు మొబైల్ ఫోన్లు, మద్యం సీసాలు స్వాధీనపరుచుకున్నట్లు తెలిపారు. అలాగే వారిపై పీఐటీఏ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. పట్టణంలోని అసాంఘిక కార్యక్రమాలకు ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదన్నారు. యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా ఉండాలని, వ్యభిచార గృహాలు అనేవి కేవలం అనైతిక మైనదని కాదని, మాదక ద్రవ్యాలు, మద్యం నేరాలకు కేంద్రంగా మారే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ రాజేష్ మీనా, పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

బతుకమ్మ ఆడిన పోలీసులు

నిర్మల్ జిల్లా కేంద్రంలోని శ్రీనగర్ కాలనీలో బుధవారం రాత్రి బతుకమ్మ వేడుక సంబరాలలో ఎస్పీ డా.జి. జానకి షర్మిల పాల్గొన్నారు. ఖానాపూర్ పట్టణంలోని ఏఆర్‌ఎస్ జూనియర్ కళాశాలలో బుధవారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో ఖానాపూర్ నారీశక్తి పోలీసులు సైతం పాల్గొన్నారు. లక్ష్మణచాంద మండల కేంద్రంలో మహిళా పోలీసులు బుధవారం బతుకమ్మ ఆడారు. ● న్యూస్‌నెట్‌వర్క్



బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న ఎస్పీ జానకి షర్మిల



ఖానాపూర్‌లో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు



ఖానాపూర్‌లో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు



లక్ష్మణచాందలో బతుకమ్మ ఆడుతున్న పోలీసులు



లంగ్డాపూర్‌లో గ్రామస్థులతో పాల్గొన్న పోలీసులు



వివేకానంద కళాశాలలో పాల్గొన్న విద్యార్థులు



ముథోల్‌లో బతుకమ్మ సంబరాల్లో ప్రిన్సిపాల్, తదితరులు



బతుకమ్మ ఆడుతున్న దృశ్యం